ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి
PRGI REGD No.: TGTEL/26/A4986
పక్కా తెలుగు | 5 DOTS NETWORK
మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 013 | మంగళవారం | 07-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com
Medchal Malkajigiri | Volume : 01 | Issue : 013 | Tuesday | 07-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri



# వామ్మో ఏఐ

- భారీగా ఉద్వాసనలు
- మైక్రోసాఫ్ట్‌లో 4,800 ఉద్యోగాల కోత

ఇది కేవలం మైక్రోసాఫ్ట్‌లో 4,800 ఉద్యోగాల కోత కథ కాదు... రేపటి ప్రపంచ ఉద్యోగ విపణికి వినిపిస్తున్న హెచ్చరిక గంట. ఒకప్పుడు మనిషి చేసే పనిని యంత్రం చేయలేదనుకునేవారు. ఇప్పుడు అదే యంత్రం... మనిషి స్థానాన్నే భర్తీ చేసే దశకు చేరుకుంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై వందల బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెరుగుతున్న వేళ... వేలాది ఉద్యోగాలు ఒక్కొక్కటిగా మాయమవుతున్నాయి. మైక్రోసాఫ్ట్ తీసుకున్న నిర్ణయం ప్రపంచ టెక్ రంగంలో కొత్త అలజడికి నాంది పలికింది. మరి రాబోయే రోజుల్లో ఏఐ సృష్టించే అవకాశాలు ఎక్కువా... లేక ఉద్యోగాలపై ముప్పే ఎక్కువా? ఇప్పుడు చూద్దాం ఈ ప్రత్యేక కథనం.

7లో..



# మనుషులు శాశ్వతం కాదు

» ట్రంప్‌కు మెలోనీ కౌంటర్
» ట్రంప్ వ్యాఖ్యలపై పీక్‌కు రగడ
» బంధాలే శాశ్వతమని స్పష్టం
» సోషల్ మీడియా పోస్టుతో దుమారం

పదవులు ఉంటాయి.. పోతాయి... నాయకులు వస్తారు.. వెళ్తారు. కానీ దేశాల మధ్య బంధాలు ఒక్క పోస్టుతో తెగిపోవు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ అట్లాంటిక్‌కు ఇరువైపులా రాజకీయ ప్రకంపనలు రేపింది. వ్యక్తిగత వ్యాఖ్యలతో మొదలైన ఈ వివాదానికి ఇటలీ మాత్రం ఒకే మాటతో కౌంటర్ ఇచ్చింది. "మనుషులు శాశ్వతం కాదు.. దేశాల మధ్య బంధాలే శాశ్వతం" అంటూ ట్రంప్ వ్యాఖ్యలకు గట్టి సందేశం పంపింది. నాటో సమావేశానికి ముందు ఈ పరిణామం అమెరికా-యూరప్ సంబంధాలపై కొత్త చర్చకు తెరతీసింది. (వివరాలు 7లో..)

# ఫ్యూచర్ సిటీపై సీఎం ఫోకస్

- పర్యాటక రంగానికి కొత్త దిశ..
- టూరిజానికి సమగ్ర ప్రణాళిక
- అర్బన్ ఫారెస్ట్ లక్ష్యంగా కసరత్తు



ప్రపంచ పర్యాటక మ్యాప్‌పై తెలంగాణను ప్రత్యేక గుర్తింపుతో నిలబెట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేగవంతం చేసింది. ఫ్యూచర్ సిటీపై సీఎం ఫోకస్ పెట్టడంతో రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త దిశ కనిపిస్తోంది. అటవీ సంపదను కాపాడుతూ అర్బన్ ఫారెస్ట్‌ల అభివృద్ధి, హెరిటేజ్ కట్టడాలకు కొత్త రూపు, ఎకో టూరిజం విస్తరణ, అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక మౌలిక సదుపాయాల కల్పనకు సమగ్ర కార్యాచరణ సిద్ధమవుతోంది. పెట్టుబడులను ఆకర్షించే ప్రాజెక్టులతో తెలంగాణను గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ, ఉపాధి అవకాశాలు, ఆర్థికాభివృద్ధి మూడు లక్ష్యాలను ఒకే వేదికపై సాధించేలా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.



తెలంగాణలో పర్యాటక రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో పర్యాటక శాఖపై నిర్వహించిన సమీక్షలో ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని సూచించారు. అర్బన్ ఫారెస్ట్ తరహాలో ప్రత్యేక ప్రాజెక్టులు చేపట్టాలని, వాటి అమలును వేగవంతం చేయడానికి ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. నగర పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు దోహదపడేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. (వివరాలు 2లో..)

# శ్రీలంక జైలులో రక్తపాతం

## జైలు నుంచి తప్పించుకునే యత్నం

- ఖైదీల అల్లర్లు: 26 మంది మృతి
- నెగొంబో జైలులో చెలరేగిన హింస

**శ్రీలంక రాజధాని కొలంబోకు సమీపంలోని నెగొంబో జైలులో చెలరేగిన ఘర్షణలు భారీ విషాదానికి దారితీశాయి. ఖైదీల మధ్య ప్రారంభమైన ఘర్షణలు క్రమంగా హింసాత్మకంగా మారడంతో కనీసం 26 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఏడుగురు జైలు అధికారులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మరో వంద మందికిపైగా గాయపడటంతో ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.**

ఆదివారం ఖైదీల మధ్య జరిగిన దాడులతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. వెంటనే జైలు పరిసరాల్లో భద్రతా బలగాలను మోహరించారు. సోమవారం కొందరు ఖైదీలు తమను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జైలు భవనం పైకప్పుపైకి ఎక్కి నిరసన చేపట్టారు. అదే సమయంలో మరికొందరు ప్రధాన గేటు వైపు దూసుకెళ్లి జైలు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. భద్రతా సిబ్బంది వారిని అడ్డుకున్నారు.

**దర్యాప్తు ప్రారంభించిన ప్రభుత్వం**

ఈ ఘటనపై శ్రీలంక న్యాయశాఖ మంత్రి హర్షణ నానాయక్కర తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి విషయంలో ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని ప్రకటించారు. ప్రత్యర్థి ముఠాల మధ్య విభేదాలే అల్లర్లకు కారణమై ఉండొచ్చని అధికా రులు అనుమానిస్తున్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి కొందరు ఖైదీలను ఇతర జైళ్లకు తరలించే నిర్ణయం తీసుకున్నారు.

**• పాత సమస్యలు మళ్లీ వెలుగులోకి**

ఈ ఘటనతో శ్రీలంక జైళ్లలో అధిక రద్దీ, భద్రతా లోపాల సమస్య మరోసారి చర్చకు వచ్చింది. 2020లో మహారా జైలులో జరిగిన అల్లర్లలో 11 మంది ఖైదీలు మృతి చెందగా, 2012లో వెల్లికడ జైలులో జరిగిన కాల్పుల్లో 27 మంది ఖైదీలు ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం నెగొంబో ఘటన కూడా జైళ్ల నిర్వహణపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది.




అధిక సంఖ్యలో ఖైదీలు ఉండటం, మౌలిక సదుపాయాల కొరత, భద్రతా వ్యవస్థలో లోపాలు ఇలాంటి ఘటనలకు కారణమవుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# లక్ష క్యూసెక్కుల నీళ్లు వృధా

- కాళేశ్వరం నుంచి హమాలీల దాకా
- రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ విమర్శల వర్షం

హైదరాబాద్ మల్లాపూర్‌లో జరిగిన 18వ హమాలీ యూనియన్ మహాసభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పార్టీ నాయకులతో కలిసి హమాలీ కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. హమాలీల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని చెప్పారు. కార్మికుల ఆరోగ్య భద్రత, సంక్షేమానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. (వివరాలు 2లో..)

# రామ..రామ..

- ట్రస్ట్‌లో కీలక మార్పులు • రామాలయ విరాళాల వివాదం
- రాజీనామాలకు ఆమోదం




అయోధ్య రామమందిర ట్రస్ట్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రామమందిర విరాళాల దుర్వినియోగ ఆరోపణల నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామాలకు ట్రస్ట్ ఆమోదం తెలిపింది. మూడు గంటలపాటు జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోగా, తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణ మోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. విరాళాల నిర్వహణపై వచ్చిన ఆరోపణలు, ట్రస్ట్ భవిష్యత్ కార్యాచరణ, పారదర్శకత చర్యలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. మరోవైపు చంపత్ రాయ్‌కు ట్రస్ట్ ఖజాంచి గోవింద్ గిరి మద్దతు ప్రకటించగా, విలువైన విరాళాల వస్తువులను ప్రజల ముందుంచి ప్రదర్శించాలని కూడా నిర్ణయించారు. (వివరాలు 2లో..)

## రామాలయ వివాదం.. బీజేపీలో అధికార పోరాటమే కారణం

» అందుకే మొత్తం వ్యవహారం బయటకు
» ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపణలు



# అయోధ్య విరాళాల వ్యవహారం

## బీజేపీ క్షమాపణ చెప్పాలి: పొన్నం

అయోధ్య రామమందిర విరాళాల వ్యవహారంపై బీజేపీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. భక్తులు విశ్వాసంతో ఇచ్చిన విరాళాల నిర్వహణలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. భక్తి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదని, ఈ అంశంపై కేంద్ర నాయకత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. సిద్దిపేటలో మీడియాతో మాట్లాడిన మంత్రి, రాముడి పేరును రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించారని విమర్శించారు. అయోధ్య ప్రజలే బీజేపీ ఎంపీని ఓడించడం ప్రజల అసంతృప్తికి నిదర్శనమని అన్నారు. ఈ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి కీలకమని పొన్నం ప్రభాకర్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రజలు, పార్టీ కార్యకర్తలు బీఎల్‌వోలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.




# డ్రామాలు ఆపండి..

## కేటీఆర్‌కు సీతక్క కౌంటర్

**కాళేశ్వరం పేరుతో ప్రజలను మభ్యపెట్టొద్దు**

**బీఆర్ఎస్ పాలనలోనే ప్రాజెక్టు దెబ్బతిందన్న మంత్రి**

మహబూబాబాద్‌లో పర్యటించిన మంత్రి సీతక్క మాజీ మంత్రి కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రాజకీయ డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల సంక్షేమం కంటే అధికారమే ఆయన లక్ష్యంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏం చేశారో ముందుగా చెప్పాలని సవాల్ విసిరారు. (2లో..)



# సభకు రావాలి... కేసీఆర్ సమాధానం చెప్పాలి

**కాళేశ్వరంపై బహిరంగ చర్చకు ఆహ్వానం**

**ప్రత్యేక అసెంబ్లీకి సై అన్న మంత్రి పొంగులేటి**

కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ వేడి మరోసారి రాజుకుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నేరుగా లక్ష్యంగా చేసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అసెంబ్లీకి వచ్చి ప్రజల ముందు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. (2లో..)




# సత్యాన్ని ఆపగలరా?

## సత్యం ప్రశ్నిస్తూనే ఉంటుంది!

- సినిమా కంటే పెద్దది 'సట్లుజ్' చరిత్ర
- సత్యం ఎప్పుడూ సజీవమే
- సినిమా కాదు.. చరిత్రకు అద్దం
- నిజం కోసం నిరంతర పోరాటం
- మళ్లీ వెలుగులోకి వచ్చిన ఖల్రా కథ

సత్యం ఎప్పుడూ శబ్దం చేయదు. కానీ అది నిశ్శబ్దంగా మనసులను వెంటాడుతుంది. కాలం ఎంత ముందుకు వెళ్లినా కొన్ని ప్రశ్నలు చరిత్ర గుండెల్లోనే మిగిలిపోతాయి. వాటికి సమాధానాలు దొరికినా గాయాలు మాత్రం మాయమవ్వవు. 'సట్లుజ్' అలాంటి ప్రశ్నలను మరోసారి దేశం ముందుకు తీసుకొచ్చిన సినిమా. ఇది ఒక వ్యక్తి జీవితకథ కాదు. ఒక రాష్ట్రం అనుభవించిన భయం, వేల కుటుంబాల వేదన, న్యాయం కోసం సాగిన అంతులేని నిరీక్షణకు అద్దం పట్టిన కథ. మానవ హక్కుల ఉద్యమకారుడు జస్వంత్ సింగ్ ఖల్రా వెలికితీసిన నిజాలు, ఆయన అదృశ్యం, భార్య పరమ్‌జిత్ కౌర్ సాగించిన దశాబ్దాల న్యాయపోరాటం ఈ చిత్రానికి ప్రాణం. విడుదలకు ముందే వివాదాల్లో చిక్కుకున్న ఈ సినిమా, విడుదలైన తర్వాత మళ్లీ నిలిపివేయబడటం మరో చర్చకు తెరలేపింది. చరిత్రను మౌనంలో బంధించగలమా? సత్యానికి గడువు ఉంటుందా? ప్రజల జ్ఞాపకాలపై తాళం వేయగలమా? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం వెతికే ప్రయాణమే 'సట్లుజ్'. ఇది సినిమా కంటే పెద్ద కథ. సమాజం తన గతాన్ని ఎదుర్కోవాల్సిందేనని గుర్తు చేసే చారిత్రక గాథ.



# ముంబైలో రెడ్ అలర్ట్

- విరుచుకుపడుతున్న వానలు
- ఎడతెరిపి లేకుండా వర్షం

మహారాష్ట్ర రాజధాని ముంబైని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో నగర జీవనం అస్తవ్యస్తమైంది. ముంబై, థానే ప్రాంతాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ కొనసాగించగా, కొంకణ్ ప్రాంతం, పుణెకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రహదారులు జలమయమవడం, రైల్వే స్టేషన్లు నీటమునగడం, (2లో..)

# ఫ్యూచర్ సిటీపై సీఎం ఫోకస్

- పర్యాటక రంగానికి కొత్త దిశ..
- టూరిజానికి సమగ్ర ప్రణాళిక
- అర్బన్ ఫారెస్ట్ లక్ష్యంగా కసరత్తు



తెలంగాణలో పర్యాటక రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో పర్యాటక శాఖపై నిర్వహించిన సమీక్షలో ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని సూచించారు. అర్బన్ ఫారెస్ట్ తరహాలో ప్రత్యేక ప్రాజెక్టులు చేపట్టాలని, వాటి అమలును వేగవంతం చేయడానికి ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. నగర పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు దోహదపడేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.

**హెరిటేజ్ కట్టడాలకు కొత్త రూపు**

పురానాపూల్ హెరిటేజ్ బ్రిడ్జిని పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దాలని సీఎం అధికారులకు సూచించారు. బ్రిడ్జిపై పర్యాటకుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. అవసరమైతే ట్రాఫిక్‌ను మళ్లించి సందర్శకులకు అనుకూల వాతావరణం కల్పించాలని ఆదేశించారు. తారామతి బారాదరి, దుర్గం చెరువును మరింత ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునీకరించి మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

**వికారాబాద్‌కు ప్రత్యేక ప్రాధాన్యం**

టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. అక్కడి వీరభద్రస్వామి ఆలయాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేసేలా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలోని అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో సమన్వయం చేసి ఎకో టూరిజం కేంద్రాలుగా తీర్చిదిద్దాలని చెప్పారు. గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాలో నగరంలో మరిన్ని ఎకో పార్కులు ఏర్పాటు చేయాలని సూచించారు.

**గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌పై దృష్టి**

డిసెంబర్‌లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ కోసం ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేలా సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని చెప్పారు. సమావేశంలో సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, పర్యాటక శాఖ కార్యదర్శి వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి పాల్గొన్నారు. ఈ నిర్ణయాలతో తెలంగాణ పర్యాటక రంగానికి కొత్త ఊపు లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# డ్రామాలు ఆపండి.. కేటీఆర్‌కు సీతక్క కౌంటర్

- కాళేశ్వరం పేరుతో ప్రజలను మభ్యపెట్టొద్దు
- బీఆర్ఎస్ పాలనలోనే ప్రాజెక్టు దెబ్బతిందన్న మంత్రి

మహబూబాబాద్‌లో పర్యటించిన మంత్రి సీతక్క మాజీ మంత్రి కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రాజకీయ డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల సంక్షేమం కంటే అధికారమే ఆయన లక్ష్యంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏం చేశారో ముందుగా చెప్పాలని సవాల్ విసిరారు.

**బీఆర్ఎస్ పాలనపైనే ఆరోపణలు**

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, దాని లోపాలు అన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని సీతక్క పేర్కొన్నారు. ప్రాజెక్టు పేరిట లక్షన్నర కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారని ఆరోపించారు. ఇప్పుడు అదే అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవాలని చూస్తున్నారని విమర్శించారు.

**పరివాహక గ్రామాల భద్రతపై ప్రశ్న**

కాళేశ్వరం ప్రాజెక్టులో మళ్లీ నీటిని నిల్వ చేయాలని డిమాండ్ చేస్తున్న కేటీఆర్, పరివాహక గ్రామాల భద్రత గురించి ఆలోచిస్తున్నారా అని సీతక్క ప్రశ్నించారు. ప్రాజెక్టులో నీరు నిల్వ చేస్తే గ్రామాలు



ప్రమాదంలో పడే పరిస్థితి వస్తే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని నిలదీశారు. ప్రజల ప్రాణాల కంటే రాజకీయ ప్రయోజనాలకే బీఆర్ఎస్ ప్రాధాన్యం ఇస్తోందని ఆమె విమర్శించారు.

# సభకు రావాలి...కేసీఆర్ సమాధానం చెప్పాలి

- కాళేశ్వరంపై బహిరంగ చర్చకు ఆహ్వానం
- ప్రత్యేక అసెంబ్లీకి సై అన్న మంత్రి పొంగులేటి

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బహిరంగ సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీకి వచ్చి పూర్తి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ తేదీ, సమయం చెబితే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ప్రజల ముందే చర్చకు రావాలని పిలుపునిచ్చారు.

**కాళేశ్వరం బాధ్యత ఎవరిది?**

సిద్ధిపేట జిల్లా ములుగు మండలంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అదే హయాంలో ప్రాజెక్టు దెబ్బతిందని గుర్తు చేశారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టు నాణ్యతపై ఇప్పుడు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేసీఆర్‌పైనే ఉందన్నారు. ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం కంటే వాస్తవాలు చెప్పాలని సూచించారు.

**ఇందిరమ్మ ఇళ్లపై వివరాలు**

రాష్ట్రంలో ఇప్పటికీ వేలాది కుటుంబాలు పూరిగుడిసెల్లో జీవిస్తున్నాయని ప్రభుత్వం గుర్తించిందని మంత్రి తెలిపారు. రెండో విడత నుంచి నాలుగో విడత వరకు వారికి ప్రాధాన్యంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. గత ప్రభుత్వం కొన్ని ప్రాంతాలకే పరిమితమై మిగిలిన నియోజకవర్గాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అసంపూర్తిగా మిగిలిన ఇళ్ల నిర్మాణాన్ని కూడా పూర్తి చేస్తున్నామని చెప్పారు. మహిళల సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ ఇళ్ల పట్టాలను మహిళల పేరుతో అందిస్తున్నట్లు వివరించారు.

**ప్రతి అర్హ కుటుంబానికి ఇల్లు**

మొదటి విడతలో ఇప్పటికే లక్షా 30 వేల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 70



వేలకుపైగా ఇళ్లు నిర్మాణ చివరి దశలో ఉన్నాయని పొంగులేటి తెలిపారు. రెండో విడతలో రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో రెండు వేల ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కులం, మతం, రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించడమే ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు.

# లక్ష క్యూసెక్కుల నీళ్లు వృధా

- కాళేశ్వరం నుంచి హమాలీల దాకా
- రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ విమర్శల వర్షం



హైదరాబాద్ మల్లాపూర్‌లో జరిగిన 18వ హమాలీ యూనియన్ మహాసభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పార్టీ నాయకులతో కలిసి హమాలీ కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. హమాలీల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని చెప్పారు. కార్మికుల ఆరోగ్య భద్రత, సంక్షేమానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

**• రేవంత్ ప్రభుత్వంపై విమర్శలు**

ప్రసంగంలో సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే ఢిల్లీ పెద్దల కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్ హౌస్‌లో పంపులను ప్రారంభిస్తే తెలంగాణ రైతులకు నీరు అందుతుందని, కానీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆ పని చేయడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్‌ను విమర్శించాలనే ఉద్దేశంతో రైతుల ప్రయోజనాలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు.

**• కాళేశ్వరం, రైతులపై వ్యాఖ్యలు**

గోదావరి నీరు సముద్రంలో వృథాగా కలుస్తున్నా ప్రభుత్వం వినియోగించుకోవడం లేదని కేటీఆర్ అన్నారు. నీరు అందిస్తే పంటలు పండుతాయని, రైతులకు మద్దతు ధర, బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే సాగునీటిని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. రైతులపై ఉన్న బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. తమపై కేసులు పెట్టినా భయపడబోమని, రైతులపై మాత్రం ప్రతీకారం చూపవద్దని ప్రభుత్వాన్ని కోరారు.

**• కేసీఆర్ పాలనపై ప్రశంసలు**

కేసీఆర్ హయాంలో సాగు విస్తీర్ణం పెరిగిందని, రైతులు, హమాలీలు, పారిశ్రామికవేత్తలు సంతోషంగా ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. హమాలీల కూలీ రేట్లను రూ.8 నుంచి రూ.26కు పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని చెప్పారు. గతంలో ఐదేళ్లకోసారి పెరిగిన కూలీ రేట్లను బీఆర్ఎస్ ప్రభుత్వం రెండేళ్లకోసారి సవరించిందని గుర్తు చేశారు. హమాలీల శ్రమకు తగిన గౌరవం కల్పించామని అన్నారు.

**• భవిష్యత్ రాజకీయాలపై సంకేతాలు**

బీఆర్ఎస్ అధికారంలో లేకపోయినా ప్రజల్లో ప్రేమ తగ్గలేదని కేటీఆర్ అన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామని చెప్పారు. మరో రెండేళ్లలో కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలన్న లక్ష్యంతో అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత తమదేనని, హమాలీల ప్రతి సమస్యకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

# గురుకులం ఫుడ్ పాయిజనింగ్

## 17 మంది విద్యార్థులకు అస్వస్థత

నిజామాబాద్ జిల్లా బీర్కూరు మండలంలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో భోజనం వికటించడంతో 17 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరోచనాలతో బాధపడిన విద్యార్థులను 108 అంబులెన్స్‌లో బాన్సువాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో 15 మంది కోలుకోవడంతో డిశ్చార్జ్ చేయగా, మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. గురుకులంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థుల ఆరోగ్యాన్ని నిరంతరం పరిశీలిస్తున్నట్లు మండల వైద్యాధికారి శ్రీలేఖ తెలిపారు. ఘటనపై అధికారులు విచారణ చేపట్టగా, బీర్కూరు సర్పంచ్ ధర్మతేజ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించారు.

# బహ్రెయిన్‌లో నిజామాబాద్ యువకుడి మృతి

## బీచ్‌లో నీటిలో మునిగి దుర్మరణం

బహ్రెయిన్‌లోని దుర్రత్ అల్ బహ్రెయిన్ సముద్ర తీరంలో తెలంగాణకు చెందిన తోట శ్రీనివాస్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడు నిజామాబాద్ జిల్లాకు చెందినవాడిగా గుర్తించారు. ఆయన 2019 నవంబర్ నుంచి బహ్రెయిన్‌లోని ఏఎంసీ సంస్థలో ప్రాజెక్ట్ విభాగంలో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. బీచ్‌కు వెళ్లిన సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న బహ్రెయిన్ కోస్ట్‌గార్డు బృందాలు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. శ్రీనివాస్ మృతిపై ఏఎంసీ సంస్థ యాజమాన్యం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది.

# రామ.. రామ..

- ట్రస్ట్‌లో కీలక మార్పులు
- రామాలయ విరాళాల వివాదం
- రాజీనామాలకు ఆమోదం

అయోధ్య రామమందిర ట్రస్ట్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రామమందిర విరాళాల దుర్వినియోగ ఆరోపణల నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామాలకు ట్రస్ట్ ఆమోదం తెలిపింది. మూడు గంటలపాటు జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోగా, తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణ మోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. విరాళాల నిర్వహణపై వచ్చిన ఆరోపణలు, ట్రస్ట్ భవిష్యత్ కార్యాచరణ, పారదర్శకత చర్యలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. మరోవైపు చంపత్ రాయ్‌కు ట్రస్ట్ ఖజాంచి గోవింద్ గిరి మద్దతు ప్రకటించగా, విలువైన విరాళాల వస్తువులను ప్రజల ముందుంచి ప్రదర్శించాలని కూడా నిర్ణయించారు.

అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగ ఆరోపణల నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా సమర్పించిన రాజీనామాలను ట్రస్ట్ సమావేశంలో ఆమోదించింది. మూడు గంటలపాటు జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రస్ట్ ఖజాంచి గోవింద్ గిరి ప్రకటించారు. తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణ మోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు.

**• సమావేశంలో కీలక చర్చలు**

రామమందిర విరాళాల వ్యవహారంపై వచ్చిన ఆరోపణల ప్రభావంపై ట్రస్ట్ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ట్రస్ట్ శాశ్వత సభ్యుల్లో ఏడుగురు ఈ సమావేశానికి హాజరయ్యారు. ట్రస్ట్ అధ్యక్షుడు నృత్య గోపాల్ దాస్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రా మాత్రం సమావేశానికి హాజరు కాలేదని సమాచారం. ఆరోపణల నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై సభ్యులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

**• చంపత్ రాయ్‌కు మద్దతు**

ట్రస్ట్ ఖజాంచి గోవింద్ గిరి చంపత్ రాయ్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించారు. రామాలయ ఉద్యమానికి ఆయన చేసిన త్యాగాలు మరువలేనివని చెప్పారు. తన దృష్టిలో చంపత్ రాయ్‌పై ఎలాంటి మచ్చ లేదని వ్యాఖ్యానించారు. ఆరోపణలు వచ్చినా ఆయన సేవలను చిన్నచూపు చూడకూడదని అభిప్రాయపడ్డారు. ట్రస్ట్ వ్యవహారాల్లో పారదర్శకత కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**• విరాళాల వస్తువుల ప్రదర్శన**

దుర్వినియోగానికి గురయ్యాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న విలువైన విరాళాల వస్తువులపై కూడా ట్రస్ట్ స్పష్టత ఇచ్చింది. అలాంటి అన్ని ఖరీదైన విరాళాల వస్తువులను ప్రజల ముందుకు తీసుకువచ్చి ప్రదర్శించాలని నిర్ణయించింది. దీనివల్ల భక్తుల్లో ఉన్న సందేహాలు తొలగుతాయని ట్రస్ట్ భావిస్తోంది. విరాళాల నిర్వహణలో విశ్వసనీయతను మరింత బలోపేతం చేసే చర్యలు కూడా చేపట్టనున్నట్లు వెల్లడించింది.



**• దేశవ్యాప్తంగా చర్చకు దారి**

రామమందిరం దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన నేపథ్యంలో ఈ పరిణామం విస్తృత చర్చకు దారితీసింది. ట్రస్ట్ తీసుకున్న నిర్ణయాలు భక్తుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేసే దిశగా ఉన్నాయని కొందరు విశ్లేషకులు భావిస్తుండగా, దర్యాప్తు పూర్తయ్యే వరకు మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ట్రస్ట్ చేపట్టిన పరిపాలనా మార్పులు రామాలయ నిర్వహణలో కీలక మలుపుగా మారాయి.

# రామాలయ వివాదం..

- బీజేపీలో అధికార పోరాటమే కారణం
- అందుకే మొత్తం వ్యవహారం బయటకు
- ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపణలు

అఖిలేశ్ యాదవ్ అయోధ్య రామాలయ విరాళాల వివాదంపై బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. రామాలయ విరాళాల వ్యవహారం బీజేపీలో జరుగుతున్న అధికార పోరాటాన్ని బయటపెట్టిందని ఆరోపించారు. ప్రజల విశ్వాసాన్ని కాపాడడం కంటే అంతర్గత విభేదాలకే అధికార పార్టీ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని వ్యాఖ్యానించారు. అయోధ్యలో ప్రజల భక్తి, విశ్వాసాలతో ఆటలాడుతున్న పరిస్థితి నెలకొందని అన్నారు. లక్నోలో నిర్వహించిన మీడియా సమావేశంలో అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ, ఈ వ్యవహారంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం కూడా బీజేపీలోని అంతర్గత విభేదాలకే నిదర్శనమని అన్నారు. ఈ కేసు ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థల పరిధిలోకి వెళ్లకుండా రాష్ట్ర స్థాయిలోనే కొనసాగడం వెనుక అధికార పోరాటమే కారణమని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మధ్య సమన్వయం కనిపించడం లేదని విమర్శించారు.

**భక్తులకు పిలుపు**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న రామభక్తులు, అయోధ్య సాధువులు, ప్రజలు ఈ అంశాన్ని గమనించాలని అఖిలేశ్ యాదవ్ కోరారు. తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజల విశ్వాసానికి సంబంధించిన అంశాల్లో పూర్తి పారదర్శకత అవసరమని అభిప్రాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో పాలన, అభివృద్ధి పనులు, విద్యా రంగం పరిస్థితిపైనా అఖిలేశ్ యాదవ్ విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడుతున్నాయని ఆరోపించారు. భవిష్యత్ ఎన్నికల్లో బీజేపీ నాయకులు గతంలో పోటీ చేసిన స్థానాల నుంచే మళ్లీ బరిలోకి రావాలని సవాల్ విసిరారు. ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం రాజకీయ విభేదాలతో కాలం గడుపుతోందని ఆయన విమర్శించారు.

# ప్రియుడి కోసం భర్త హత్య.. హార్పిక్‌తో దారుణం

**వివాహేతర బంధం కోసం భర్తను హతమార్చిన భార్య**





తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా న్యాల్కల్‌లో దారుణ ఘటన వెలుగుచూసింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో భర్త ప్రశాంత్‌ను భార్య సంధ్య ప్రియుడు అనిల్‌తో కలిసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. కుటుంబ పోషణ కోసం గల్ఫ్‌కు వెళ్లిన ప్రశాంత్ తిరిగి వచ్చిన తర్వాత భార్య వ్యవహారంపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో అతడిని అంతమొందించాలని సంధ్య పథకం వేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ముందుగా భర్తకు అతిగా మద్యం తాగించి మత్తులోకి వెళ్లేలా చేసి, అనంతరం ప్రియుడితో కలిసి తీవ్రంగా దాడి చేసి భవనం పై నుంచి కిందకు తోసేశారు. గాయాలతో ఉన్న ప్రశాంత్ ఇంకా ప్రాణాలతో ఉండటాన్ని గమనించిన సంధ్య, టాయిలెట్ క్లీనర్ హార్పిక్‌ను సిరంజి ద్వారా నరాల్లోకి ఎక్కించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు సంధ్య, అనిల్‌లను అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

# చెట్లు నరికితే జరిమానా తప్పదు

**హరితహారానికి రక్షణగా చర్యలు**

నిజామాబాద్ జిల్లా పందిమడుగు గ్రామంలో హరితహారంలో భాగంగా పెరిగిన చెట్లను నరికిన వారిపై గ్రామపంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్నాయనే కారణంతో, మరికొందరు వ్యవసాయ భూములకు కంచె వేసేందుకు చెట్లను నరికినట్లు గుర్తించారు. దీనిపై స్పందించిన గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్ ఒకరికి రూ.2 వేల, మరొకరికి రూ.1,000 జరిమానా విధించారు. రోడ్ల పక్కన నాటిన చెట్లను ఎవరైనా నరికితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని కార్యదర్శి మహేష్, సర్పంచ్ గోవింద్ హెచ్చరించారు. హరితహార మొక్కలను ప్రతి ఒక్కరూ సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

# ముంబైలో రెడ్ అలర్ట్

- విరుచుకుపడుతున్న వానలు
- ఎడతెరిపి లేకుండా వర్షం

మహారాష్ట్ర రాజధాని ముంబైలో భారీ వర్షాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముంబైతో పాటు థానే ప్రాంతాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ కొనసాగించింది. సమీప భవిష్యత్తులో వర్షాల తీవ్రత తగ్గే అవకాశం లేదని స్పష్టం చేసింది. కొంకణ్ ప్రాంతం, పుణెకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఘాట్ ప్రాంతాల్లో భారీ వర్షాలతో పాటు చిన్నపాటి కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

**నీటమునిగిన రైల్వే టెర్మినస్**

కుర్లాలోని లోక్‌మాన్య తిలక్ టెర్మినస్ రైల్వే స్టేషన్ భారీ వర్షాలకు నీటమునిగింది. నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులు జలమయమై ట్రాఫిక్ తీవ్రంగా దెబ్బతింది. గత 12 గంటల్లో 200 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**అత్యవసరమైతేనే బయటకు రండి**

రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ మంత్రి గిరీష్ మహాజన్ ప్రజలకు కీలక సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మ్యాన్‌హోల్స్ సమీపంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ట్రాఫిక్‌ను



క్రమబద్ధీకరిస్తున్నామని చెప్పారు. సముద్ర తీర ప్రాంతాల్లో సెల్ఫీలు తీసుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు.

**వర్షాలతో ప్రమాదాల పరంపర**

ఈ వర్షాకాలంలో ఇప్పటికే పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. చెంబూర్‌లో బలమైన గాలులకు చెట్టు కూలి పాఠశాల బస్సుపై పడటంతో 11 ఏళ్ల విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. పలువురు విద్యార్థులు గాయపడ్డారు. మరోవైపు వర్లీ సముద్ర తీరానికి వెళ్లొద్దని పోలీసులు, మున్సిపల్ అధికారులు హెచ్చరిస్తున్నా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## బండి భగీరథ్ బెయిల్

- **హైకోర్టు తీర్పు రిజర్వ్**

పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. బెయిల్ మంజూరు చేయొద్దని బాధితురాలి తరపు న్యాయవాదులు, పోలీసులు కోర్టును కోరారు. బెయిల్ లభిస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వాదించారు. బాలిక ఫిర్యాదు, వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేసి అభియోగాలను సవరించినట్లు ప్రభుత్వం తెలిపింది. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నందున ఈ దశలో బెయిల్ ఇవ్వడం సరికాదని వివరించింది. అన్ని వాదనలు విన్న హైకోర్టు బెయిల్ పిటిషన్‌పై తన తీర్పును రిజర్వ్ చేసింది.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ఎంపీ సమీక్ష

గంటి హరీష్ మాధుర్ బాలయోగి అమలాపురం ఆర్టీసీ డిపోను సందర్శించి గోదావరి పుష్కరాలు-2027 సన్నాహకాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక బస్సులు, రవాణా సౌకర్యాలు, ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అలాగే అమలాపురం బస్టాండ్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జి. సత్యనారాయణ, డిపో మేనేజర్ డి.ఎల్.ఎన్. శర్మతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏఐ టెర్రర్

- **ఎక్స్‌బాక్స్‌లో భారీ కోతలు**
- **3,200 ఉద్యోగాల కోత**
- **కంపెనీ రీషేప్ అన్న సీఈవో**



మైక్రోసాఫ్ట్‌కు చెందిన ఎక్స్‌బాక్స్ సంస్థ భారీ ఉద్యోగ కోతలను ప్రకటించింది. మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 20 శాతం మందిని తొలగించాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియలో మొత్తం 3,200 మంది ఉద్యోగులు ప్రభావితమవుతారు. సంస్థ సీఈఓ ఆశా శర్మ ఉద్యోగులకు పంపిన లేఖలో ఈ నిర్ణయాన్ని వివరించారు. మొదటి దశలో 1,600 మందిని తొలగిస్తుండగా, మిగిలిన ఉద్యోగులను 2027 ఆర్థిక సంవత్సరం వరకు విడతల వారీగా రిలీవ్ చేయనున్నట్లు వెల్లడించారు.

### వ్యాపార పరిస్థితులే కారణమని వివరణ

సంస్థ ప్రస్తుతం ఆరోగ్యకరమైన ఆర్థిక పరిస్థితిలో లేదని ఆశా శర్మ తెలిపారు. ఇతర గేమింగ్ సంస్థలతో పోలిస్తే లాభాల మార్జిన్ చాలా తక్కువగా ఉందన్నారు. ప్రతి డాలర్ పెట్టుబడిపై సంస్థకు 64 సెంట్ల నష్టం వస్తోందని వెల్లడించారు. ఉద్యోగుల ప్రతిభపై తమకు ఎలాంటి సందేహం లేదని, వ్యాపార పరిస్థితుల కారణంగానే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై భారీ పెట్టుబడులు పెట్టే వ్యూహంలో భాగంగానే మైక్రోసాఫ్ట్ ఈ మార్పులు చేపడుతోంది. ఎక్స్‌బాక్స్‌లోని నాలుగు గేమింగ్ స్టూడియోలను విక్రయించాలని నిర్ణయించింది. మరో స్టూడియోను కూడా విక్రయించే అవకాశాలను పరిశీలిస్తోంది. స్వతంత్ర గేమ్ డెవలపర్లకు మరింత అవకాశాలు కల్పిస్తూ కొత్త అభివృద్ధి నమూనా తీసుకురావాలని సంస్థ భావిస్తోంది.

### నిర్వహణలో భారీ మార్పులు

సంస్థలో ప్రస్తుతం అధిక స్థాయిలో ఉన్న నిర్వహణ వ్యవస్థ నిర్ణయాల వేగాన్ని తగ్గిస్తోందని సీఈఓ అభిప్రాయపడ్డారు. అందుకే మేనేజ్‌మెంట్ స్థాయిలను గరిష్ఠంగా ఐదుకు, వీలైన చోట మూడుకు పరిమితం చేయాలని నిర్ణయించారు. సంస్థ ఖర్చులను తగ్గించే లక్ష్యంతో బాహ్య సేవలపై వ్యయాన్ని 50 శాతం తగ్గించనున్నారు. ఇదే సమయంలో హెలెన్ చియాంగ్‌ను ఎక్స్‌బాక్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా నియమిస్తూ కీలక బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఉద్యోగ కోతలు బాధాకరమైన నిర్ణయమే అయినా, దీర్ఘకాలంలో ఎక్స్‌బాక్స్‌ను మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని ఆశా శర్మ తెలిపారు. గతంలో ఎన్నడూ లేనంతగా పెట్టుబడులు కొనసాగిస్తామని, అయితే ఇకపై స్పష్టమైన ప్రణాళిక, క్రమశిక్షణతో ముందుకు సాగుతామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా గేమింగ్ రంగంలో అగ్రస్థానాన్ని నిలబెట్టుకునే దిశగా సంస్థ కొత్త వ్యూహాలతో అడుగులు వేస్తోందని పేర్కొన్నారు.

## రాశి ఫలితాలు

**07.07.2026 మంగళవారం**

**మేషం:** ఉద్యోగంలో ఓర్పుతో వ్యవహరిస్తే మంచి ఫలితాలు పొందుతారు. అనవసర ప్రయాణాలు, ఖర్చుల్లో జాగ్రత్త అవసరం.

**వృషభం:** కుటుంబ విషయాల్లో వాదనలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపారులకు అనుకూల సమయం, విద్యార్థులకు పెద్దల ఆశీస్సులు శుభప్రదం.

**మిథునం:** ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రయాణాల్లో జాగ్రత్తగా ఉండాలి. మిత్రులతో మాటల్లో సంయమనం పాటిస్తే సమస్యలు తగ్గుతాయి.

**కర్కాటకం:** జీవిత భాగస్వామితో సఖ్యతగా మెలగడం వల్ల ప్రశాంతత లభిస్తుంది. పనిభారం పెరిగే అవకాశం ఉన్నా ఓర్పుతో పూర్తి చేయగలరు.

**సింహం:** ముఖ్యమైన నిర్ణయాలను వాయిదా వేయడం శ్రేయస్కరం. కుటుంబ సభ్యుల ప్రేమ, ఆదరణకు ప్రాధాన్యం ఇవ్వండి.

**కన్యా:** ఉద్యోగంలో చిన్న ఆటంకాలు ఎదురైనా సహనంతో ముందుకు సాగండి. తండ్రి ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం మంచిది.

**తులా:** ఓర్పుతో వ్యవహరిస్తే పనులు విజయవంతంగా పూర్తవుతాయి. పత్రాలు నింపేటప్పుడు, విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

**వృశ్చికం:** మతిమరుపు వల్ల పొరపాట్లు జరిగే అవకాశం ఉంది కాబట్టి జాగ్రత్త అవసరం. ఆర్థిక వ్యవహారాల్లో ఆచితూచి నిర్ణయాలు తీసుకోండి.

**ధనుస్సు:** మాట తీరు మీకు గౌరవాన్ని తీసుకొస్తుంది. ఖర్చులను నియంత్రిస్తూ కుటుంబంతో సఖ్యతను కొనసాగించండి.

**మకరం:** బద్ధకాన్ని దూరం చేసి పనులపై దృష్టి పెడితే విజయం సాధిస్తారు. ప్రయాణాలు, ప్రజా సంబంధిత పనుల్లో శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది.

**కుంభం:** ఆర్థిక విషయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలి. బయటకు వెళ్లినప్పుడు విలువైన వస్తువులను మరచిపోకుండా చూసుకోండి.

**మీనం:** పాత మిత్రులను కలుసుకోవడం ఆనందాన్ని కలిగిస్తుంది. వ్యాపార, ఉద్యోగ రంగాల్లో అనుకూల అవకాశాలు లభించే సూచనలు ఉన్నాయి.



*టీటీడీ అనుబంధ సంస్థ సమరసత సిద్ధాంతి*
*'దైవజ్ఞ ' పులిపాక చంద్రశేఖర శర్మ*
*శ్రీ చక్ర పంచాంగ కర్త 9440783005*

## ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం వేగవంతం చేయాలి

రామగుండం నియోజకవర్గానికి మంజూరైన 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. స్థల సేకరణ, నిర్మాణంలో ప్రభుత్వాలు, అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల జాప్యం జరుగుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసినా పనులు ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. ఈఎస్ఐ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే వేలాది మంది కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు లభిస్తాయని తెలిపారు. వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

# నేతన్నలపై వరాల జల్లు

- **ఆప్కో స్వర్ణోత్సవంలో ప్రకటన**




మంగళగిరిలో నిర్వహించిన ఆప్కో స్వర్ణోత్సవ వేడుకల్లో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత నేతన్నలకు పలు శుభవార్తలు ప్రకటించారు. త్వరలోనే 'నేతన్న భరోసా' పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. చేనేత సహకార సంఘాలకు రావాల్సిన రూ.6.50 కోట్ల బకాయిలను రెండు విడతల్లో చెల్లిస్తామని తెలిపారు. ఈ నెల 15న రూ.4 కోట్లు, ఆగస్టు మొదటి వారంలో మరో రూ.2.50 కోట్లు విడుదల చేస్తామని చెప్పారు. ఆప్కో ద్వారా నూలు సరఫరా చేసి నేతన్నల పెట్టుబడి భారం తగ్గించే చర్యలు చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. చేనేత కార్మికులకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఆప్కోను ఆధునికీకరించి లాభాల బాట పట్టించామని, డిజిటలైజేషన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వెల్లడించారు. చేనేత ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని మంత్రి సవిత అన్నారు. వారే రాష్ట్ర చేనేత రంగానికి బ్రాండ్ అంబాసిడర్లని కొనియాడారు. చేనేత కార్మికులకు పెన్షన్, నూలుపై సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్ సాయం కొనసాగిస్తున్నామని చెప్పారు. టీటీడీతో ఆప్కో చరిత్రలో తొలిసారి ఒప్పందం కుదిరిందని, ఆసక్తి ఉన్న సహకార సంఘాలకు దుశ్శాలువాలు, చీరలు, కండువాల తయారీ ఆర్డర్లు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ చేనేత సంఘాల ప్రతినిధులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులను మంత్రి సత్కరించారు.

## మత్స్యకారుల ఆదాయం పెరుగుతోంది

- **కలెక్టర్ గరిమా అగర్వాల్ వెల్లడి**

ప్రభుత్వం అమలు చేస్తున్న మత్స్య అభివృద్ధి పథకాలతో గ్రామీణ మత్స్యకారుల జీవనోపాధి బలోపేతం అవుతోందని రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. ప్రపంచ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వం, జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు ప్రతినిధులతో కలిసి జిల్లాలో అమలవుతున్న పథకాలపై సమీక్ష నిర్వహించారు. చేప పిల్లల ఉత్పత్తి, మార్కెటింగ్, సహకార సంఘాలకు అందుతున్న ఆర్థిక సహాయంపై వివరించారు. అనంతరం బోయినపల్లి మండలంలోని నర్సింగాపూర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చేపల ఉత్పత్తి పెరగడంతో మత్స్యకారుల ఆదాయం, జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని అధికారులు తెలిపారు.

## క్యాన్సర్‌పై ధైర్యంతో పోరాడండి

- **బసవతారకం ఆస్పత్రికి సంజయ్ దత్**



బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించారు. ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ, ట్రస్టు సభ్యులు నారా బ్రాహ్మణి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం రోగులను పరామర్శించి చిన్నారులకు పండ్లు, బహుమతులు అందించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ ఆస్పత్రి అత్యాధునిక క్యాన్సర్ చికిత్సా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సంజయ్ దత్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను జయించాలంటే మనోధైర్యమే ప్రధానమని, వ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా కోలుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. బాలకృష్ణ నాయకత్వంలో ఆస్పత్రి అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు.

## గురుకులాల్లో నాణ్యమైన భోజనం కరువు

- **ప్రభుత్వంపై ఎమ్మెల్యే కోవ లక్ష్మి విమర్శలు**

ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం బుసిమెట్ట గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో కంపౌండ్ వాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె, గతంలో కేసీఆర్ ప్రభుత్వం గురుకులాల్లో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించిందని, ప్రస్తుతం పరిస్థితి దిగజారిందని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం కూడా అందడం లేదని ఆరోపించారు. కంపౌండ్ వాల్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పోలవరం పనులు వేగవంతం

- **240 మోటార్లతో నీటి తొలగింపు**
- **డీ వాటరింగ్‌కు శ్రీకారం**
- **ప్రత్యేక పూజలతో ప్రారంభం**



పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా డీ వాటరింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. గ్యాప్1 ప్రాంతంలో జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ఎంఈఐఎల్ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం అధికారికంగా డీ వాటరింగ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ రెడ్డి రామచంద్రరావు, ఎంఈఐఎల్ జీఎం ఏ. గంగాధర్, డీజీఎం మురళి పమ్మి పాల్గొన్నారు. ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో నిల్వ ఉన్న నీటిని తొలగించేందుకు మొత్తం 240 మోటార్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా సుమారు 700 క్యూసెక్కుల నీటిని బయటకు పంపే సామర్థ్యం ఉంది. కొన్ని మోటార్లు 88 హార్స్‌పవర్, మరికొన్ని 83.5 హార్స్‌పవర్ సామర్థ్యంతో పనిచేస్తాయి. తొలి దశలో 40 మోటార్లను ప్రారంభించారు. అవసరాన్ని బట్టి మిగిలిన మోటార్లను కూడా వినియోగించనున్నారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్మాణ ప్రాంతంలో నీరు నిల్వ కాకుండా ఎప్పటికప్పుడు డీ వాటరింగ్ చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ ప్రాంతాల్లో కూడా భవిష్యత్‌లో ఇదే విధంగా నీటిని తొలగిస్తూ నిర్మాణ పనులు నిరంతరాయంగా కొనసాగించేలా కార్యాచరణ రూపొందించారు. దీనివల్ల ప్రాజెక్టు పనులకు అంతరాయం లేకుండా నిర్మాణం వేగంగా పూర్తయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు.



## యుద్ధ ప్రాతిపదికన గాలింపు

- **గల్లంతైన మత్స్యకారుల కోసం ముమ్మర వేట**
- **సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు సమీక్ష**

విశాఖ తీరంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి అచ్చెన్నాయుడు సమావేశంలో పాల్గొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి గల్లంతైన మత్స్యకారుల ఆచూకీని వీలైనంత త్వరగా గుర్తించాలని సీఎం అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ఎప్పటికప్పుడు సమాచారం అందేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు.

### యుద్ధ ప్రాతిపదికన సెర్చ్ ఆపరేషన్

మత్స్యకారుల కోసం యుద్ధ ప్రాతిపదికన గాలింపు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. భారత కోస్ట్ గార్డ్, నేవీ, కోస్టల్ పోలీసులు కలిసి సముద్రంలో విస్తృతంగా గాలిస్తున్నారు. కోస్ట్ గార్డ్‌కు చెందిన రెండు నౌకలు, హెలికాప్టర్లు రంగంలోకి దిగాయి. తూర్పు నౌకాదళం కూడా రెండు యుద్ధ నౌకలు, రెండు విమానాలను సహాయక చర్యలకు వినియోగిస్తోంది. సముద్రం, గగనతలం నుంచి ఒకేసారి గాలింపు కొనసాగుతోంది. సముద్రంలో ఎత్తైన కెరటాలు, వేగంగా వీచే గాలులు సహాయక బృందాలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ రెస్క్యూ బృందాలు వెనక్కి తగ్గకుండా గాలింపు కొనసాగిస్తున్నాయి. ఆధునిక పరికరాలతో పాటు వైమానిక నిఘా ద్వారా కూడా అన్వేషణ చేపడుతున్నారు. ప్రతి సమాచారాన్ని పరిశీలిస్తూ గల్లంతైన వారి ఆచూకీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

### బాధిత కుటుంబాలకు ఎంపీ భరోసా

విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ బాధిత కుటుంబాలను కలిసి ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి మత్స్యకారుడి ఆచూకీ తెలిసే వరకు గాలింపు ఆగదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా మత్స్యకారుల భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. వాతావరణ హెచ్చరికలు, సముద్ర భద్రతపై కొత్త మార్గదర్శకాలు రూపొందించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. ప్రస్తుతం గల్లంతైన మత్స్యకారుల కోసం అన్ని ప్రభుత్వ యంత్రాంగాలు సమన్వయంతో సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయి.


## బీఎల్‌వోల నిర్లక్ష్యం

- **ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు**

బీఎల్‌వోలు రాష్ట్రవ్యాప్తంగా సక్రమంగా విధులు నిర్వహించడం లేదని బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్సీలు ఎల్. రమణ, ఇతర నేతలు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎన్యూమరేషన్ ఫారాలు చాలా మంది ఓటర్లకు అందడం లేదని, ఎస్ఐఆర్ ప్రక్రియకు ఇచ్చిన గడువును పొడిగించాలని కోరారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపు, ఓటర్ల పేర్లలోని గందరగోళంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ అంశాలను కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి కూడా తీసుకెళ్తామని వినోద్ కుమార్ తెలిపారు.

## ఐటీడీపీ నేతపై అంగన్‌వాడీ సంఘం ఫిర్యాదు

- **వేధింపులపై చర్యలకు నేతల డిమాండ్**





ఏపీ అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు వీరబల్లి మండల ఐటీడీపీ అధ్యక్షుడు కాల్వపల్లి వెంకటరమణపై కడప జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలను బెదిరించడం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం, ఫోన్‌ల ద్వారా వేధించడం, మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే ఈ విషయాన్ని ఎన్. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ దృష్టికి కూడా తీసుకెళ్తామని సంఘం నాయకులు తెలిపారు.

## 116 ఏళ్ల భక్తికి తిరుమలలో గౌరవం

శ్రీవారి దర్శనం కోసం 116 ఏళ్ల వృద్ధురాలు నవనీతమ్మ అలిపిరి నుంచి కాలినడకన తిరుమలకు చేరుకోవడం భక్తులను ఆకట్టుకుంది. ఆమె ప్రయాణానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం టీటీడీ దృష్టికి చేరింది. మొదట ఆమె కర్ణాటకకు చెందినవారని ప్రచారం జరిగినా, విజిలెన్స్ సిబ్బంది విచారణలో తమిళనాడుకు చెందిన నవనీతమ్మగా గుర్తించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశాల మేరకు నవనీతమ్మకు, ఆమె కుటుంబ సభ్యులకు సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం ఏర్పాటు చేశారు. రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర వేదపండితులతో వేదాశీర్వచనం చేయించి, పట్టువస్త్రం కప్పి, తీర్థప్రసాదాలు అందజేశారు. నవనీతమ్మకు నమస్కరించి ఆశీర్వాదం కూడా తీసుకున్నారు.

ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి
4
GENERAL NEWS
మంగళవారం 07 జులై 2026
www.prabhathakiranam.com

# ఏలేశ్వరంలో అంబేద్కర్ గురుకుల పాఠశాల పారిశుధ్య పనులు

ఇటీవల కురిసిన వర్షాల వల్ల స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాల ప్రాంగణంలో గడ్డి, చెత్త పేరుకుపోయి పారిశుధ్య సమస్య తలెత్తింది. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ శారద దృష్టికి తీసుకెళ్లడంతో మండల పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ) మరియు సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) తక్షణమే స్పందించారు.

ట్రస్ట్ ఆధ్వర్యంలో, ఆయన తన సొంత నిధులతో సోమవారం కళాశాల ప్రాంగణంలో పారిశుధ్య పనులను ప్రారంభించారు. జంగిల్‌ను తొలగించి పరిసరాలను పూర్తిగా శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థినులు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంలో చదువుకునేలా ఈ చర్యలు చేపట్టామని, భవిష్యత్తులోనూ విద్యాసంస్థల అభివృద్ధికి ట్రస్ట్ తరపున సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామరాజు వర్మ, ఎంఈఓ అబ్బాయి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం: ఎస్పీ

రాహుల్ మీనా ఆధ్వర్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ స్వయంగా వినతిపత్రాలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. మొత్తం 27 ఫిర్యాదులు నమోదుకాగా, భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు ప్రధానంగా ఉన్నాయి. సంబంధిత పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులు పంపించి, నిష్పక్షపాత విచారణతో చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులను పారదర్శకంగా, జాప్యం లేకుండా పరిష్కరించేందుకు జిల్లా పోలీసులు కట్టుబడి ఉన్నారని ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్-2026 పోస్టర్ ఆవిష్కరణ

అమలాపురంలో అమరావతి ఛాంపియన్‌షిప్ 2026 పోస్టర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిడియా దేవి, ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆవిష్కరించారు. జూలై 15 నుంచి ఆగస్టు 26 వరకు మూడు దశల్లో జరిగే ఈ పోటీల్లో అండర్ 17, అండర్ 23 విభాగాల క్రీడాకారులు 12 క్రీడాంశాల్లో పాల్గొననున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువత తమ ప్రతిభను చాటుకునేందుకు ఇది మంచి వేదిక అని వారు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విజేతలకు రూ.91.90 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.



# వ్యామోహం.. కుటుంబానికి విషాదం

- భర్త హత్యకు సుపారీ.. ప్రియుడితో జైలుపాలు
- అక్రమ సంబంధంతో జీవితం ఛిన్నాభిన్నం

వివాహ బంధాన్ని కాపాడాల్సిన భార్య... అదే బంధాన్ని రక్తంతో ముగించింది. అక్రమ సంబంధం మోజులో భర్తే అడ్డుగా ఉన్నాడని భావించిన మహిళ, ప్రియుడితో కలిసి దారుణ కుట్ర పన్ని హత్య చేయించింది. మరింత షాకింగ్ విషయం ఏమిటంటే... భర్త కష్టపడి సంపాదించిన డబ్బునే అతడి హత్యకు సుపారీగా వినియోగించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అనకాపల్లి జిల్లాలో వెలుగుచూసిన ఈ ఘటన ఇద్దరు చిన్నారులను అనాథలుగా మార్చింది. తండ్రిని కోల్పోయిన వారు, తల్లి జైలుకు వెళ్లడంతో జీవితాంతం మరిచిపోలేని విషాదాన్ని ఎదుర్కొంటున్నారు. క్షణిక వ్యామోహం ఒక కుటుంబాన్ని ఎలా ఛిన్నాభిన్నం చేస్తుందో ఈ ఘటన మరోసారి చూపించింది. అనకాపల్లి జిల్లా శ్రీరామపురంలో వెలుగుచూసిన హత్య కేసు కలకలం రేపింది. దాంపత్య బంధాన్ని పక్కనబెట్టి అక్రమ సంబంధం కోసం భర్తను హత్య చేయించిన ఘటన స్థానికంగా (5లో..)

# సహజ వనరులే రాష్ట్ర అభివృద్ధికి బలం

- ఆర్థికాభివృద్ధికి మూడు ఎకనామిక్ రీజియన్లు
- సమగ్ర ప్రణాళికకు సీఎం చంద్రబాబు ఆదేశాలు




రాష్ట్రంలో ఉన్న సహజ వనరులను సమర్థంగా వినియోగిస్తే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధిపై సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ప్రాంతం ప్రత్యేకతకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. ఆరు నెలల్లో అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే తుది ప్రణాళికను ఖరారు చేయాలని స్పష్టం చేశారు.

### రాయలసీమకు హార్టికల్చర్ దిశ

కడప జిల్లా లింగాల మండలాన్ని హార్టికల్చర్ అభివృద్ధికి ఆదర్శంగా తీసుకోవాలని సీఎం సూచించారు. ఉద్యానవన పంటల సాగుతో అక్కడ ప్రజల తలసరి ఆదాయం రూ.7.30 లక్షలకు చేరడం విశేషమన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఉద్యానవన రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ప్రోత్సహిస్తే రైతుల ఆదాయం పెరగడంతో పాటు జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని వివరించారు. (5లో..)

# తగ్గిన ప్రాభవం.. వస్తుందా పూర్వ వైభవం

## నేటి నుంచి రెండు రోజుల పాటు కడపలో జగన్..


7లో..

- » పోయిన చోటే వెదుక్కునే పనిలో జగన్
- » వైఎస్ కుటుంబానికి రాజకీయ అడ్డా కడప
- » సమీకరణాలు మార్చేసిన 2024 ఎన్నికలు
- » హెచ్చరికగా ఉపఎన్నికల ఫలితాలు
- » కడపపై ఫుల్ ఫోకస్ పెట్టిన వైసీపీ అధినేత
- » కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపే ప్రయత్నం
- » కూటమి విభేదాలపై ఫ్యాన్ పార్టీ నజర్
- » రాజకీయ గడపపై పట్టు సాధించే వ్యూహం
- » సొంత ఇంటిని చక్కబెట్టే పనిలో వైఎస్ జగన్

**2024 ఎన్నికల ఫలితాల తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పొలిటికల్ స్ట్రాటజీని రీఎలైన్ చేస్తున్నారా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ఎదుర్కొన్న ఎదురుదెబ్బతో పాటు, ఒకప్పుడు అజేయంగా భావించిన ఉమ్మడి కడప జిల్లాలోనూ పార్టీ ప్రభావం తగ్గడం.. అక్కడ పార్టీ నాయకులంతా అధికార పక్షంలో చేరిపోవడంతో ఆయన ఇప్పుడు కొత్త వ్యూహాల వైపు అడుగులు వేస్తున్నట్టు కన్పిస్తున్న. అందుకే ముందుగ సొంత అడ్డాలో పార్టీని బలోపేతం చేసి, అక్కడి నుంచే పార్టీ పునర్నిర్మాణాన్ని ప్రారంభించాలని జగన్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. వైఎస్ కుటుంబానికి ఉమ్మడి కడప జిల్లా ఎన్నో దశాబ్దాలుగా రాజకీయంగా అండగా నిలిచింది. 2019 ఎన్నికల్లో జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలను గెలుచుకున్న వైసీపీ, 2024లో మూడంటే మూడు స్థానాలకే పరిమితమైంది. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల ఫలితాలు కూడా పార్టీకి హెచ్చరికగా మారాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాల తర్వాత జగన్ తరచూ కడప జిల్లాలో పర్యటిస్తూ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కడపలో కోల్పోయిన రాజకీయ ఆధిపత్యాన్ని తిరిగి సాధించాలనే లక్ష్యంతో జగన్ అడుగులు వేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఈ వ్యూహాలు ఎంతవరకు ఫలిస్తాయి, కడప రాజకీయాల్లో మళ్లీ పాత పరిస్థితులు వస్తాయా అనే ప్రశ్నలను విశ్లేషిస్తోంది ఈ కథనం**



# ఏపీకి అమరావతే శాశ్వత రాజధాని


### జగన్ వైఖరిపై బీజేపీ ఎమ్మెల్యే విమర్శలు

విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతినే అన్ని రాజకీయ పార్టీలు గతంలో అంగీకరించాయని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ తన వైఖరిని మార్చి మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకురావడం ప్రజలను అయోమయంలోకి నెట్టిందని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో 'మావిగన్' పేరుతో కొత్త హామీలు ఇవ్వడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తుండటాన్ని జీర్ణించుకోలేకనే జగన్ అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ ఆరోపణలు చేయడం కంటే ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా స్పందించాలని సూచించారు. అమరావతినే రాష్ట్ర రాజధానిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, భవిష్యత్తులో కూడా అమరావతే శాశ్వత రాజధానిగా కొనసాగుతుందని విష్ణుకుమార్ రాజు స్పష్టం చేశారు. మావిగన్ వంటి అంశాలపై మాట్లాడాలంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని, బయట సమావేశాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. ఓటర్ల జాబితా సవరణలో 'ఎస్ఐఆర్' పేరుతో ఓట్ల తొలగింపు జరుగుతోందన్న ఆరోపణలను ఆయన ఖండించారు. విశాఖలోని రుషికొండ భవనాలు రాష్ట్రానికి విలువైన ఆస్తి అని పేర్కొన్నారు. వాటిని కేవలం ఫైవ్ స్టార్ హోటల్‌గా పరిమితం చేయకుండా ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా వినియోగించాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.


5లో..

# యుద్ధ విమానాలతో ప్రధానికి ఎస్కార్ట్‌తో స్వాగతం

- మోదీ కోసం ఎయిర్‌పోర్టుకు వచ్చిన అధ్యక్షుడు
- ఇండోనేషియాలో యాక్ట్ ఈస్ట్ విధానానికి ఊపు
- ప్రధాని మూడు దేశాల పర్యటన ప్రారంభం



3లో..

# ఏఐ టెర్రర్


ఎక్స్‌బాక్స్‌లో భారీ కోతలు • 3,200 ఉద్యోగాల కోత • కంపెనీ రీషేప్ అన్న సీఈవో

# కొరియాలో లోకేశ్ పెట్టుబడుల వేట

- ఏపీకి భారీ పరిశ్రమలే లక్ష్యంగా డీల్స్
- సెమీకండక్టర్ పరిశ్రమలకు ఆహ్వానం

పారిశ్రామిక రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పెట్టుబడుల వేట కొనసాగిస్తున్నారు. సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, విద్యుత్ పరికరాలు, మైక్రో ఎల్ఈడీ, ఫుట్‌వేర్ తయారీ రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రముఖ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. శ్రీసిటీ, తిరుపతి ప్రాంతాలను ప్రపంచ స్థాయి తయారీ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు ముందుంచారు. స్టార్టప్‌లు, ఆధునిక సాంకేతిక సంస్థలను ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానిస్తూ పెట్టుబడులకు అనుకూల విధానాలను వివరించారు. విదేశీ పెట్టుబడులతో కొత్త పరిశ్రమలు, వేలాది ఉద్యోగాలు, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపు తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఈ పర్యటన కొనసాగుతోంది. (వివరాలు 5లో..)





# గోవా ప్లాన్ బట్టబయలు

### సాయి కృష్ణ కేసులో కొత్త ట్విస్ట్ • హైకోర్టులో కేసు కీలక విచారణ
### సిట్ దర్యాప్తులో కీలక విషయాలు

గాదె సాయికృష్ణ కస్టడీ మరణం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం కీలక విషయాలను వెలుగులోకి తీసుకొచ్చింది. కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో సాక్ష్యాలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరిగినట్లు సిట్ గుర్తించింది. పోలీసు కస్టడీ నుంచి సాయికృష్ణ తప్పించుకుని గోవాకు వెళ్లినట్లు కథ సృష్టించేందుకు ముందుగానే పక్కా ప్రణాళిక రూపొందించినట్లు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. (వివరాలు 5లో..)



# రాజకీయ ప్రయోజనాలే లక్ష్యం

### కాపులకు ఆ పార్టీలో గౌరవం లేదు
### వైసీపీపై సోము వీర్రాజు విమర్శలు

రాజమండ్రిలో మీడియాతో మాట్లాడిన బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కాపు సామాజిక వర్గాన్ని వైసీపీ రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే వినియోగించుకుందని ఆరోపించారు. కాపులకు తగిన గౌరవం, ప్రాధాన్యం కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాపు సామాజిక వర్గం ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైసీపీలో సీనియర్ నేత బొత్స సత్యనారాయణకు కూడా తగిన ప్రాధాన్యం దక్కలేదని సోము వీర్రాజు పేర్కొన్నారు. ఆయన మంత్రిగా ఉన్న సమయంలోనే విజయనగర రాజకీయాల్లో ఇతర నాయకులకు ప్రోత్సాహం ఇచ్చారని, అందులో విజయసాయిరెడ్డి పాత్ర కూడా ఉందని ఆరోపించారు. కాపు నాయకులను పావులుగా ఉపయోగించుకున్నారని విమర్శించారు. కాపులకు రిజర్వేషన్లు ఇవ్వబోమని గతంలో మాజీ సీఎం జగన్ వ్యాఖ్యానించడం సరైన నిర్ణయం కాదని సోము వీర్రాజు అన్నారు. వైసీపీ పాలనలో కాపు సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందని ఆరోపించారు. సమావేశాల పేరుతో కాపు యువతను రెచ్చగొట్టడం మానుకోవాలని సూచించారు. కాపు అని చెప్పుకోవడానికి ఎవరూ వెనుకాడాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ కాపు సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పిస్తోందని సోము వీర్రాజు పేర్కొన్నారు.



# బీసీలకు అన్యాయం

- వైసీపీ రాష్ట్రవ్యాప్త ఆందోళన
- బీసీ సదస్సుతో ఉద్యమానికి శ్రీకారం

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమం, రాజ్యాంగబద్ధ అవకాశాల విషయంలో కూటమి ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమైంది. వచ్చే నెల విజయవాడలో భారీ బీసీ సదస్సు నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు ప్రకటించారు. పార్టీ ముఖ్యనేతలు సజ్జల రామకృష్ణా రెడ్డి, బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు అనిల్, విడదల రజినీ, జోగి రమేశ్‌తో పాటు పలువురు ముఖ్యనేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జోన్ల వారీగా సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు నేతలు వెల్లడించారు. (వివరాలు 5లో..)

# జాహ్నవి అదృశ్యం కేసులో కొత్త ట్విస్ట్

కాకినాడ జిల్లాలో చిన్నారి జాహ్నవి అదృశ్యం కేసు కొత్త మలుపు తిరిగింది. కొద్ది రోజుల క్రితం కనిపించకుండా పోయిన జాహ్నవి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఇదే సమయంలో సీసీటీవీ దృశ్యాల్లో కనిపించిన ఓ కారుపై చిన్నారి కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జాహ్నవి అదృశ్యమైన రోజే ఆ కారు గ్రామంలో పలుమార్లు తిరిగినట్లు గుర్తించినట్లు చెబుతున్నారు. మరోవైపు అదే కారు నర్సీపట్నం సమీపంలో జాహ్నవి తాతను ఢీకొట్టిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ రెండు ఘటనలకు సంబంధం ఉండొచ్చనే అనుమానంతో కారుపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని వారు కోరుతున్నారు. సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా పోలీసులు విచారణను వేగవంతం చేశారు. జాహ్నవి ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.





# యుద్ధ ప్రాతిపదికన గాలింపు

### గల్లంతైన మత్స్యకారుల కోసం ముమ్మర వేట
### సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు సమీక్ష

విశాఖ తీరంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి అచ్చెన్నాయుడు సమావేశంలో పాల్గొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి గల్లంతైన మత్స్యకారుల ఆచూకీని వీలైనంత త్వరగా గుర్తించాలని సీఎం అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ఎప్పటికప్పుడు సమాచారం అందేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. (వివరాలు 3లో..)

# అప్పుల ఉచ్చు

- హృదయ విదారక ఘటన
- ప్రాణాలు తీసిన అప్పుల భారం
- అమ్మిన ఇంట్లోనే జీవితాలు అంతం

అప్పుల భారం ఒక కుటుంబాన్ని ఎంతటి విషాదానికి నెట్టిందో కర్ణాటకలోని గంగావతి ఘటన హృదయాలను కలచివేస్తోంది. వ్యాపార నష్టాలతో ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న దంపతులు అప్పులు తీర్చేందుకు సొంత ఇంటినే విక్రయించారు. అయినా సమస్యలు తగ్గకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. చివరకు తమ ఇంజినీరింగ్ చదువుతున్న కుమారుడితో కలిసి గతంలో అమ్ముకున్న అదే ఇంటికి వెళ్లి బలవన్మరణానికి పాల్పడ్డారు. (వివరాలు 6లో..)





## యుద్ధవిమానాల ప్రధానికి
# ఎస్కార్ట్‌తో స్వాగతం

- మోదీ కోసం ఎయిర్‌పోర్టుకు వచ్చిన అధ్యక్షుడు
- ఇండోనేషియాలో యాక్ట్ ఈస్ట్ విధానానికి ఊపు
- ప్రధాని మూడు దేశాల పర్యటన ప్రారంభం

**భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇండోనేషియా పర్యటనకు అపూర్వ స్వాగతం లభించింది. ఆయన ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానం ఇండోనేషియా గగనతలంలోకి ప్రవేశించగానే ఆ దేశ వైమానిక దళానికి చెందిన ఎఫ్-16 ఫైటింగ్ ఫాల్కన్, సుఖోయ్ ఎస్‌యూ-30 యుద్ధవిమానాలు భద్రతా ఎస్కార్ట్‌గా వెంట ప్రయాణించి విశేష ఆకర్షణగా నిలిచాయి. జకార్తా విమానాశ్రయానికి స్వయంగా చేరుకున్న ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ప్రధానమంత్రి మోదీకి ఘన స్వాగతం పలకడం ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది.**

భారత ప్రధాని నరేంద్రమోదీ మూడు దేశాల పర్యటనలో తొలి విడతగా ఇండోనేషియాకు చేరుకున్నారు. జకార్తా విమానాశ్రయంలో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా స్వాగతం పలకడం విశేషంగా నిలిచింది. నలుగురు మంత్రులు కూడా ప్రధానికి స్వాగతం పలికారు. సంప్రదాయ వేడుకలతో పాటు గౌరవ వందనం నిర్వహించి ప్రత్యేక ఆతిథ్యం అందించారు. ఈ స్వాగతానికి తాను ఎంతో సంతోషించానని ప్రధాని మోదీ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

### అపూర్వ ఆతిథ్యం.. ఆకాశంలో స్వాగతం

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇండోనేషియా పర్యటన సందర్భంగా ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. ప్రధానమంత్రి ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానం ఇండోనేషియా గగనతలంలోకి ప్రవేశించగానే ఆ దేశ వైమానిక దళానికి చెందిన ఎఫ్-16 ఫైటింగ్ ఫాల్కన్, సుఖోయ్ ఎస్‌యూ-30 యుద్ధవిమానాలు భద్రతా ఎస్కార్ట్‌గా వెంట ప్రయాణించాయి. ఈ దృశ్యం భారత్-ఇండోనేషియా మధ్య బలపడుతున్న స్నేహ సంబంధాలకు ప్రతీకగా నిలిచింది. ఇటీవల ఇండోనేషియా భారత్ తయారు చేసిన బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థ కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకోవడంతో రెండు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలపడింది. ప్రస్తుతం జరుగుతున్న ప్రధానమంత్రి మోదీ పర్యటనతో వాణిజ్యం, వ్యూహాత్మక భాగస్వామ్యం, రక్షణ రంగ సహకారం కొత్త ఊపు అందుకుంటాయని దౌత్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### భాగస్వామ్యానికి మరింత బలం

2018లో భారత్, ఇండోనేషియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రారంభించాయని ప్రధాని గుర్తుచేశారు. ఆ భాగస్వామ్యం రెండు దేశాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చిందని తెలిపారు. ఈ పర్యటనలో అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో పలు కీలక అంశాలపై చర్చలు జరపనున్నట్లు వెల్లడించారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సముద్ర భద్రత, సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా ఇద్దరు నాయకులు యోగ్యకర్తలోని ప్రంబనన్ టెంపుల్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఇండోనేషియాలోని అతిపెద్ద హిందూ ఆలయంగా పేరొందిన ఈ చారిత్రక క్షేత్రం రెండు దేశాల సాంస్కృతిక బంధాలకు ప్రతీకగా భావిస్తున్నారు. ఇండోనేషియాలో నివసిస్తున్న భారతీయులతో కూడా ప్రధాని మోదీ సమావేశం కానున్నారు. ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

### యాక్ట్ ఈస్ట్ విధానానికి కొత్త ఊపు

ఈ పర్యటన భారత్ యాక్ట్ ఈస్ట్ విధానం, మహాసాగర్ దృక్పథానికి మరింత బలం చేకూర్చనుంది. ఇండోపసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత, సమ్మిళిత సహకారాన్ని విస్తరించడంలో ఈ పర్యటన కీలకంగా భావిస్తున్నారు. ఇండోనేషియా తర్వాత ప్రధాని మోదీ, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్‌లో పర్యటించనున్నారు. ఈ మూడు దేశాల పర్యటనతో ఆసియాపసిఫిక్ ప్రాంతంలో భారత్ దౌత్య సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యం, ఆర్థిక సహకారం మరింత బలోపేతం కానుందని దౌత్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# సహజ వనరులే రాష్ట్ర అభివృద్ధికి బలం

- ఆర్థికాభివృద్ధికి మూడు ఎకనామిక్ రీజియన్లు
- సమగ్ర ప్రణాళికకు సీఎం చంద్రబాబు ఆదేశాలు



రాష్ట్రంలో ఉన్న సహజ వనరులను సమర్థంగా వినియోగిస్తే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధిపై సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ప్రాంతం ప్రత్యేకతకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. ఆరు నెలల్లో అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే తుది ప్రణాళికను ఖరారు చేయాలని స్పష్టం చేశారు.

### రాయలసీమకు హార్టికల్చర్ దిశ

కడప జిల్లా లింగాల మండలాన్ని హార్టికల్చర్ అభివృద్ధికి ఆదర్శంగా తీసుకోవాలని సీఎం సూచించారు. ఉద్యానవన పంటల సాగుతో అక్కడ ప్రజల తలసరి ఆదాయం రూ.7.30 లక్షలకు చేరడం విశేషమన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఉద్యానవన రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ప్రోత్సహిస్తే రైతుల ఆదాయం పెరగడంతో పాటు జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని వివరించారు.

### విశాఖకు బే సిటీ రూపకల్పన

విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో 51.88 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ' అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. తీరప్రాంత పర్యాటకం, గ్లోబల్ వ్యాపార కేంద్రాలు, ఆధునిక జీవన విధానానికి అనువుగా నగరాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్, ఐటీ ప్రాజెక్టులు, హోటళ్ల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని చెప్పారు. అరకు-పాడేరు-విశాఖను సమగ్ర పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని నిర్దేశించారు.

### అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ సిటీలు

అమరావతి, విశాఖ, తిరుపతిలో ప్రైవేట్ భాగస్వామ్యంతో అంతర్జాతీయ ప్రమాణాల స్పోర్ట్స్ సిటీలను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. సూర్యలంక సహా తీరప్రాంతాల్లో బీచ్ అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. వెల్‌నెస్ సెంటర్లు, పర్యాటక మౌలిక వసతులకు భూ కేటాయింపులు చేపట్టాలని చెప్పారు.

### అమరావతి రీజియన్‌కు ప్రత్యేక కార్యాచరణ


అమరావతి ఎకనామిక్ రీజియన్ రాష్ట్ర జనాభాలో 32 శాతం మందికి కేంద్రంగా ఉందని అధికారులు వివరించారు. ఆక్వా, పామాయిల్, కోకో ఉత్పత్తులు, కొల్లేరు సరస్సు సామర్థ్యాన్ని వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. రెండు నెలల్లో ప్రతి జిల్లాకు డిస్ట్రిక్ట్ ఎకనామిక్ ప్రొఫైల్ సిద్ధం చేసి పెట్టుబడులకు అనువైన రంగాలను గుర్తించాలని ఆదేశించారు.

### 2047 లక్ష్యంగా ఆర్థిక ప్రగతి

స్వర్ణాంధ్ర-2047 లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని సీఎం తెలిపారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ ఒక్కటే 0.90 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు. ప్రతి రెండు నెలలకు మూడు ఎకనామిక్ రీజియన్ల పురోగతిని సమీక్షిస్తూ లక్ష్యాల అమలును వేగవంతం చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

# కొరియాలో లోకేశ్ పెట్టుబడుల వేట

- ఏపీకి భారీ పరిశ్రమలే లక్ష్యంగా డీల్స్
- సెమీకండక్టర్ పరిశ్రమలకు ఆహ్వానం



పారిశ్రామిక రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పెట్టుబడుల వేట కొనసాగిస్తున్నారు. సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, విద్యుత్ పరికరాలు, మైక్రో ఎల్‌ఈడీ, ఫుట్‌వేర్ తయారీ రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రముఖ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. శ్రీసిటీ, తిరుపతి ప్రాంతాలను ప్రపంచ స్థాయి తయారీ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు ముందుంచారు. స్టార్టప్‌లు, ఆధునిక సాంకేతిక సంస్థలను ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానిస్తూ పెట్టుబడులకు అనుకూల విధానాలను వివరించారు. విదేశీ పెట్టుబడులతో కొత్త పరిశ్రమలు, వేలాది ఉద్యోగాలు, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపు తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఈ పర్యటన కొనసాగుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ప్రతినిధి బృందం దక్షిణ కొరియా పర్యటన కొనసాగిస్తోంది. సియోల్‌లో సెమీకండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యాంగ్ లీతో జరిగిన సమావేశంలో రాష్ట్ర పెట్టుబడి అవకాశాలను వివరించారు. 2026లో దేశవ్యాప్తంగా వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కే లభించాయని తెలిపారు. ఇటీవల ఇండియా సెమీకండక్టర్స్ మిషన్ ఆమోదించిన ప్రాజెక్టులను ప్రస్తావిస్తూ శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో డిస్‌ప్లే ఫ్యాబ్ ఏర్పాటు చేయాలని సంస్థను కోరారు.

### విద్యుత్ పరికరాల పరిశ్రమలపై దృష్టి

హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ పవర్ సిస్టమ్స్ అధ్యక్షుడు యోకోటా తకేషితో కూడా సమావేశం జరిగింది. రాష్ట్రంలో విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ వేగంగా సాగుతోందని వివరించారు. తిరుపతి లేదా శ్రీసిటీ సమీపంలో స్విచ్‌గేర్లు, ఇతర విద్యుత్ పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పరిశ్రమల విస్తరణతో విద్యుత్ రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడతాయని అభిప్రాయపడ్డారు.

### స్టార్టప్‌లకు ఏపీ నుంచి ఆహ్వానం

సియోల్ బిజినెస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కొరియా స్టార్టప్ వ్యవస్థాపకులతో చర్చలు జరిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలు సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. భారత ఏఐ రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు కొరియా స్టార్టప్‌లు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

### మైక్రో ఎల్‌ఈడీ హబ్ ప్రతిపాదన

సాఫ్ట్‌ఈపీఐ సంస్థ సీఈవో సుంగ్ మిన్ హ్వాంగ్, సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ ఇన్‌సుంగ్ చోతో జరిగిన సమావేశంలో మైక్రో ఎల్‌ఈడీ డిస్‌ప్లే మెటీరియల్ హబ్ ఏర్పాటుపై చర్చించారు. భారతీయ భాగస్వామ్య సంస్థలతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో ఆధునిక తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇది ఎలక్ట్రానిక్స్ రంగ అభివృద్ధికి దోహదం చేస్తుందని తెలిపారు.

### ఫుట్‌వేర్ యూనిట్‌కు వేగం

స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ తయారీ సంస్థ షూఆల్స్ ఛైర్మన్ లీ చియాంగ్‌గెన్‌తో కూడా సమావేశమయ్యారు. ఇప్పటికే కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం రూ.300 కోట్ల పెట్టుబడితో ఏపీలో ఏర్పాటు కానున్న తయారీ యూనిట్ పనులను త్వరగా ప్రారంభించాలని కోరారు. ఈ పరిశ్రమ ద్వారా సుమారు మూడు వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉందని వెల్లడించారు. విదేశీ పెట్టుబడులతో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపు తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# వ్యామోహం
## కుటుంబానికి విషాదం

- భర్త హత్యకు సుపారీ.. ప్రియుడితో జైలుపాలు
- అక్రమ సంబంధంతో జీవితం ఛిన్నాభిన్నం



వివాహ బంధాన్ని కాపాడాల్సిన భార్య... అదే బంధాన్ని రక్తంతో ముగించింది. అక్రమ సంబంధం మోజులో భర్తే అడ్డుగా ఉన్నాడని భావించిన మహిళ, ప్రియుడితో కలిసి దారుణ కుట్ర పన్ని హత్య చేయించింది. మరింత షాకింగ్ విషయం ఏమిటంటే... భర్త కష్టపడి సంపాదించిన డబ్బునే అతడి హత్యకు సుపారీగా వినియోగించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అనకాపల్లి జిల్లాలో వెలుగుచూసిన ఈ ఘటన ఇద్దరు చిన్నారులను అనాథలుగా మార్చింది. తండ్రిని కోల్పోయిన వారు, తల్లి జైలుకు వెళ్లడంతో జీవితాంతం మరిచిపోలేని విషాదాన్ని ఎదుర్కొంటున్నారు. క్షణిక వ్యామోహం ఒక కుటుంబాన్ని ఎలా ఛిన్నాభిన్నం చేస్తుందో ఈ ఘటన మరోసారి చూపించింది.

అనకాపల్లి జిల్లా శ్రీరామపురంలో వెలుగుచూసిన హత్య కేసు కలకలం రేపింది. దాంపత్య బంధాన్ని పక్కనబెట్టి అక్రమ సంబంధం కోసం భర్తను హత్య చేయించిన ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. కుటుంబానికి అండగా నిలవాల్సిన భార్య తీసుకున్న నిర్ణయం చివరకు ఇద్దరు చిన్నారుల జీవితాలను అనాథలుగా మార్చింది. క్షణిక వ్యామోహం ఎంతటి దారుణ పరిణామాలకు దారితీస్తుందో ఈ ఘటన మరోసారి గుర్తు చేసింది.

### భర్త డబ్బులతోనే హత్య కుట్ర

పోలీసుల కథనం ప్రకారం అప్పలనాయుడు కుటుంబ పోషణ కోసం కష్టపడి పనిచేస్తూ భార్య, పిల్లల భవిష్యత్తు కోసం సంపాదిస్తున్నాడు. ఇదే సమయంలో అతని భార్య హైమాకు గంగాధర్‌తో సన్నిహిత పరిచయం ఏర్పడింది. ఈ బంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన ఇద్దరూ అతడిని హత్య చేయాలని కుట్ర పన్నినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో అత్యంత దిగ్భ్రాంతికర అంశం భర్త సంపాదించిన డబ్బునే అతని హత్యకు సుపారీగా వినియోగించడమే. పక్కా ప్రణాళికతో సుపారీ గ్యాంగ్‌ను ఆశ్రయించి ఇంట్లోనే అప్పలనాయుడిని హత్య చేయించినట్లు పోలీసులు గుర్తించారు. ఘటన తర్వాత అనుమానం రాకుండా వ్యవహరించినా సాంకేతిక ఆధారాలు, కాల్ డేటా, విచారణలో లభించిన సమాచారం అసలు నిజాన్ని బయటపెట్టాయి.

### చిన్నారుల భవిష్యత్తుపై ఆందోళన

సేకరించిన ఆధారాల ఆధారంగా పోలీసులు హైమా, ఆమె ప్రియుడు గంగాధర్‌తో పాటు మరో నిందితుడిని అరెస్టు చేశారు. కేసులో మరికొన్ని అంశాలపై లోతుగా దర్యాప్తు కొనసాగుతోంది. నేరానికి సంబంధించిన ప్రతి కోణాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ ఘటనలో అత్యంత బాధాకర విషయం ఇద్దరు చిన్నారుల పరిస్థితి. తండ్రిని హత్యలో కోల్పోయిన వారు, తల్లి జైలుకు వెళ్లడంతో తల్లిదండ్రుల ప్రేమకు దూరమయ్యారు. వారి భవిష్యత్తు అనిశ్చితిలో పడింది. కుటుంబ పెద్దల తప్పిదాలకు చిన్నారులు మూల్యం చెల్లించాల్సి రావడం అందరినీ కలచివేస్తోంది.

### నేరం తెచ్చేది జీవితాంతం శిక్షే

కుటుంబ సమస్యలకు హత్య ఎప్పుడూ పరిష్కారం కాదని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. విభేదాలు వచ్చినప్పుడు చట్టబద్ధమైన మార్గాలను ఎంచుకోవాల్సిందే తప్ప నేరాలకు పాల్పడితే చివరకు జైలు జీవితం, కుటుంబాల విధ్వంసమే మిగులుతుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. క్షణిక వ్యామోహం కోసం తీసుకున్న నిర్ణయం అనేక జీవితాలను చీకటిలోకి నెట్టిందనే విషాద సత్యాన్ని ఈ ఘటన మరోసారి గుర్తు చేసింది.




# బీసీలకు అన్యాయం

- వైసీపీ రాష్ట్రవ్యాప్త ఆందోళన
- బీసీ సదస్సుతో ఉద్యమానికి శ్రీకారం

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమం, రాజ్యాంగబద్ధ అవకాశాల విషయంలో కూటమి ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమైంది. వచ్చే నెల విజయవాడలో భారీ బీసీ సదస్సు నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు ప్రకటించారు. పార్టీ ముఖ్యనేతలు సజ్జల రామకృష్ణా రెడ్డి, బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు అనిల్, విడదల రజినీ, జోగి రమేశ్‌తో పాటు పలువురు ముఖ్యనేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జోన్లవారీగా సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు నేతలు వెల్లడించారు.

### ప్రభుత్వంపై వైసీపీ ఆరోపణలు

మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మాజీ ఎంపీ మార్గాని భరత్ మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయలేదని విమర్శించారు. బీసీ వర్గానికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదని, బీసీ కార్పొరేషన్లకు పూర్తిస్థాయిలో ఛైర్మన్లను నియమించలేదని ఆరోపించారు. బీసీల అభివృద్ధి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు.

### బీసీల పట్ల కూటమి సర్కార్ నిర్లక్ష్యం

తమ ప్రభుత్వ హయాంలో ఒకేసారి 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వెనుకబడిన వర్గాలకు విస్తృత రాజకీయ అవకాశాలు కల్పించామని నాయకులు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చర్యలు చేపట్టామని గుర్తుచేశారు. ఆ ప్రక్రియ తర్వాత న్యాయపరమైన కారణాలతో నిలిచిపోయిందని చెప్పారు. బీసీలకు ఇచ్చిన హామీల అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పిస్తామని వైసీపీ నాయకులు తెలిపారు. విజయవాడ సదస్సు తర్వాత అన్ని ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించి కూటమి ప్రభుత్వ వైఖరిపై ప్రచారం చేపడతామని వెల్లడించారు. బీసీల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

# పెట్టుబడులపై ఏపీ దృష్టి

- విదేశాల్లో ప్రతినిధుల నియామకం

విదేశీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లైజన్, ప్రత్యేక ప్రతినిధులను నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసి వెంటనే అమల్లోకి తీసుకొచ్చింది. ఉత్తర అమెరికాకు ప్రిన్సిపల్ లైజన్‌గా సతీశ్ మండువ, పశ్చిమాసియా, ఇతర దేశాలకు రాధాకృష్ణరావు, యూరప్‌కు జయకుమార్ గుంటుపల్లి, మిగిలిన దేశాలకు శ్రీనివాస్ పల్లపోతును ప్రత్యేక ప్రతినిధులుగా నియమించింది. జీఓ ఆర్టీ నంబర్ 1333 ద్వారా ఈ నియామకాలకు ఆమోదం తెలిపిన ప్రభుత్వం, అంతర్జాతీయ అనుసంధానం, విదేశీ పెట్టుబడుల సాధనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించింది.

# గోవా ప్లాన్ బట్టబయలు

- సాయి కృష్ణ కేసులో కొత్త ట్విస్ట్
- హైకోర్టులో కేసు కీలక విచారణ
- సిట్ దర్యాప్తులో కీలక విషయాలు



గాదె సాయికృష్ణ కస్టడీ మరణం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం కీలక విషయాలను వెలుగులోకి తీసుకొచ్చింది. కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో సాక్ష్యాలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరిగినట్లు సిట్ గుర్తించింది. పోలీసు కస్టడీ నుంచి సాయికృష్ణ తప్పించుకుని గోవాకు వెళ్లినట్లు కథ సృష్టించేందుకు ముందుగానే పక్కా ప్రణాళిక రూపొందించినట్లు దర్యాప్తులో తేలినట్లు సమాచారం.

### మొబైల్ ఫోన్‌తో గోవాకు పంపిన వ్యక్తి

సిట్ విచారణలో హెడ్ కానిస్టేబుల్ అశోక్ కీలక పాత్ర పోషించినట్లు అధికారులు గుర్తించారు. జిమ్ ట్రైనర్ సుశాంత్‌ను గోవాకు పంపుతూ సాయికృష్ణ మొబైల్ ఫోన్‌ను అతని చేతిలో పెట్టినట్లు వెల్లడైంది. ఆ ఫోన్ గోవాలో ఉన్నట్లు సిగ్నల్స్ చూపించి సాయికృష్ణ అక్కడికి పారిపోయాడనే అభిప్రాయం కలిగించే ప్రయత్నం జరిగినట్లు సిట్ అనుమానిస్తోంది.

### కాల్ డేటాపై లోతైన పరిశీలన

సస్పెండ్ అయిన సీఐ నాగరాజు, న్యాయపరమైన కస్టడీలో ఉన్న నలుగురు కానిస్టేబుళ్ల కాల్ డేటాను సిట్ పూర్తిగా పరిశీలించింది. మే 5 నుంచి నెలాఖరు వరకు ఎవరితో మాట్లాడారు, కొత్త నంబర్లు ఏవి, రాత్రి వేళల్లో జరిగిన కాల్స్, తరచూ సంప్రదించిన వ్యక్తుల వివరాలను విశ్లేషించింది. సోషల్ మీడియా గ్రూపుల వినియోగంపైనా అధికారులు దృష్టి పెట్టారు.

### జిమ్ ట్రైనర్ వాంగ్మూలం నమోదు

గోవా ప్రయాణానికి సంబంధించిన హోటల్ బుకింగ్ వివరాలు, ఇతర ఆధారాలను సేకరించిన సిట్ అధికారులు జిమ్ ట్రైనర్‌ను కూడా విచారించారు. తనకు ఒక మొబైల్ ఫోన్ ఇచ్చి గోవాకు తీసుకెళ్లాలని పోలీసు కానిస్టేబుల్ చెప్పాడని సుశాంత్ విచారణలో వెల్లడించినట్లు సమాచారం. ఆ ఫోన్ నుంచి ఎవరితోనైనా మాట్లాడారా అనే కోణంలో కూడా సిట్ దర్యాప్తు కొనసాగిస్తోంది.

### సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు: హైకోర్టులో కీలక విచారణ

గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో నిందితుడిగా ఉన్న సస్పెండెడ్ సీఐ నాగరాజు కస్టడీకి సంబంధించి విజయవాడ కోర్టు విధించిన షరతుల సవరణపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కీలక విచారణ జరిగింది. దర్యాప్తు సమర్థంగా సాగేందుకు ప్రస్తుతం ఉన్న కొన్ని షరతులు ఆటంకంగా మారుతున్నాయని సిట్ తరఫున ప్రభుత్వం వాదించింది. విచారణ సమయంలో వీడియో రికార్డింగ్‌కు అభ్యంతరం లేదని, అయితే ఆడియో రికార్డింగ్ వల్ల దర్యాప్తు గోప్యత దెబ్బతింటుందని తెలిపింది. మరోవైపు నాగరాజు తరఫు న్యాయవాది భద్రతా కారణాల దృష్ట్యా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలోనే విచారణ జరపాలని కోరారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు తీర్పును మంగళవారానికి రిజర్వ్ చేయడంతో ఈ కేసుపై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

### కుట్ర కోణంలో కొనసాగుతున్న దర్యాప్తు

సాక్ష్యాలను మళ్లించే ప్రయత్నం వెనుక మరెవరి పాత్ర ఉందా అనే అంశంపై సిట్ దర్యాప్తు విస్తరించింది. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరి పాత్రను గుర్తించేందుకు అధికారులు ఆధారాలు సేకరిస్తున్నారు. కస్టడీ మరణం తర్వాత జరిగిన పరిణామాలు, ఫోన్ కదలికలు, కాల్ రికార్డులు, వ్యక్తుల వాంగ్మూలాల ఆధారంగా కేసును మరింత బలోపేతం చేస్తున్నారు. ఈ దర్యాప్తులో ఇంకా కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.




- సినిమా కంటే పెద్దది 'సట్లుజ్' చరిత్ర
- సత్యం ఎప్పుడూ సజీవమే
- సినిమా కాదు.. చరిత్రకు అద్దం
- నిజం కోసం నిరంతర పోరాటం
- మళ్లీ వెలుగులోకి వచ్చిన ఖల్రా కథ

**సత్యం ఎప్పుడూ శబ్దం చేయదు. కానీ అది నిశ్శబ్దంగా మనసులను వెంటాడుతుంది. కాలం ఎంత ముందుకు వెళ్లినా కొన్ని ప్రశ్నలు చరిత్ర గుండెల్లోనే మిగిలిపోతాయి. వాటికి సమాధానాలు దొరికినా గాయాలు మాత్రం మాయమవ్వవు. 'సట్లుజ్' అలాంటి ప్రశ్నలను మరోసారి దేశం ముందుకు తీసుకొచ్చిన సినిమా. ఇది ఒక వ్యక్తి జీవితకథ కాదు. ఒక రాష్ట్రం అనుభవించిన భయం, వేల కుటుంబాల వేదన, న్యాయం కోసం సాగిన అంతులేని నిరీక్షణకు అద్దం పట్టిన కథ. మానవ హక్కుల ఉద్యమకారుడు జస్వంత్ సింగ్ ఖల్రా వెలికితీసిన నిజాలు, ఆయన అదృశ్యం, భార్య పరమ్‌జిత్ కౌర్ సాగించిన దశాబ్దాల న్యాయపోరాటం ఈ చిత్రానికి ప్రాణం. విడుదలకు ముందే వివాదాల్లో చిక్కుకున్న ఈ సినిమా, విడుదలైన తర్వాత మళ్లీ నిలిపివేయబడటం మరో చర్చకు తెరలేపింది. చరిత్రను మౌనంలో బంధించగలమా? సత్యానికి గడువు ఉంటుందా? ప్రజల జ్ఞాపకాలపై తాళం వేయగలమా? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం వెతికే ప్రయాణమే 'సట్లుజ్'. ఇది సినిమా కంటే పెద్ద కథ. సమాజం తన గతాన్ని ఎదుర్కోవాల్సిందేనని గుర్తు చేసే చారిత్రక గాథ.**

**కొన్ని సినిమాలు వినోదం కోసం వస్తాయి. కొన్ని సినిమాలు ఆలోచింపజేస్తాయి. మరికొన్ని సినిమాలు సమాజం దాచిపెట్టాలని చూసిన చరిత్రను మళ్లీ ప్రజల ముందుకు తీసుకొస్తాయి. 'సట్లుజ్' అలాంటి చిత్రమే. మొదట 'పంజాబ్ 95' పేరుతో రూపొందిన ఈ చిత్రం ఎన్నో సంవత్సరాలు సెన్సార్ వివాదాలు, చట్టపరమైన అడ్డంకులు, పేరు మార్పుల మధ్య ప్రయాణించింది. చివరకు ఓటీటీ వేదికపై ప్రేక్షకుల ముందుకు వచ్చిన కొద్ది రోజులకే భారత్‌లో అందుబాటులో లేకుండా పోయింది. దీంతో సినిమా కంటే దాని వెనుక ఉన్న కథ దేశవ్యాప్తంగా చర్చగా మారింది. ఇది కేవలం ఒక సినీ వివాదం కాదు. ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, చరిత్ర, జ్ఞాపకాలు, న్యాయం గురించి మరోసారి దేశం మాట్లాడేలా చేసిన సంఘటన.**

### జస్వంత్ సింగ్ ఖల్రా... ఒక మనిషి కాదు, ఒక ప్రశ్న

పంజాబ్ చరిత్రలో జస్వంత్ సింగ్ ఖల్రా పేరు వినగానే ధైర్యం గుర్తుకొస్తుంది. ఆయన రాజకీయ నాయకుడు కాదు. అధికారంలో ఉన్న వ్యక్తి కాదు. సాధారణ మానవ హక్కుల ఉద్యమకారుడు. కానీ ఆయన అడిగిన ప్రశ్నలు అధికార వ్యవస్థనే కుదిపేశాయి. 1980, 1990 దశకాల్లో పంజాబ్ తీవ్రవాదం, ఎదురుకాల్పులు, అదృశ్యాలతో అల్లకల్లోలంగా మారింది. ఆ కాలంలో కుటుంబాలకు సమాచారం ఇవ్వకుండా గుర్తు తెలియని వ్యక్తుల పేరుతో దహనం చేసిన మృతదేహాల వివరాలను ఖల్రా సేకరించడం ప్రారంభించారు. పురపాలక రికార్డులు, దహనవాటికల నమోదు పుస్తకాలు పరిశీలిస్తూ వేలాది మరణాల వెనుక ఉన్న అనుమానాలను వెలుగులోకి తీసుకొచ్చారు. "ఈ మృతదేహాలు ఎవరివి? కుటుంబాలకు ఎందుకు సమాచారం ఇవ్వలేదు?" అనే సాధారణ ప్రశ్నే తరువాత దేశవ్యాప్తంగా పెద్ద ఉద్యమంగా మారింది.

### 1995 సెప్టెంబర్ 6... చరిత్రలో చెరిగిపోని ఉదయం

నిజాన్ని వెతకడం ఎప్పుడూ సులభం కాదు. ముఖ్యంగా భయం పాలనగా మారిన కాలంలో అది మరింత కష్టం. పంజాబ్‌లో అలాంటి వాతావరణమే నెలకొంది. ప్రజలు మాట్లాడటానికి భయపడ్డారు. సాక్షులు ముందుకు రావడానికి వెనుకంజ వేశారు. అలాంటి పరిస్థితుల్లో ఖల్రా ప్రభుత్వ పత్రాలనే ఆధారంగా చేసుకొని పరిశోధన కొనసాగించారు. ఒక్కో నమోదు పుస్తకాన్ని పరిశీలిస్తూ కనిపించకుండా పోయిన జీవితాల వెనుక కథలను వెతికారు. చనిపోయినవారి గౌరవం కోసం సాగిన ఈ ప్రయాణమే చివరకు ఆయన జీవితాన్ని ప్రమాదంలోకి నెట్టింది. 1995 సెప్టెంబర్ 6. అమృత్‌సర్‌లోని కబీర్ పార్క్‌లో తన ఇంటి ముందు జస్వంత్ సింగ్ ఖల్రా కారు శుభ్రం చేస్తున్నారు. ఉదయం సుమారు 9.20 గంటల సమయంలో ఒక మారుతీ వ్యాన్ అక్కడికి చేరుకుంది. ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాల ప్రకారం సాయుధ పోలీసు సిబ్బంది వాహనం నుంచి దిగి ఖల్రాను బలవంతంగా తీసుకెళ్లారు. ఆయన ప్రతిఘటించినా వినిపించలేదు. వెనుక మరో పోలీసు వాహనం కూడా వెళ్తున్నట్లు పలువురు చెప్పారు. ఆ రోజు తర్వాత ఖల్రా మళ్లీ సజీవంగా కనిపించలేదు. ఆ ఉదయం ఒక వ్యక్తి మాత్రమే అదృశ్యం కాలేదు. ఒక కుటుంబం జీవితమే మారిపోయింది. భారత మానవ హక్కుల చరిత్రలో అత్యంత కీలకమైన అధ్యాయం కూడా అక్కడి నుంచే ప్రారంభమైంది.

### • భార్య ప్రారంభించిన అసాధారణ పోరాటం

భర్త కనిపించకుండా పోయిన తర్వాత చాలామంది ఆశలు వదిలేస్తారు. కానీ పరమ్‌జిత్ కౌర్ ఖల్రా వెనక్కి తగ్గలేదు. భర్త కోసం ఎదురుచూడడమే కాదు. నిజం కోసం పోరాడాలని నిర్ణయించుకున్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. భర్తను పోలీసులు అపహరించారని ఆరోపిస్తూ హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఒక సాధారణ గృహిణి దేశ అత్యున్నత న్యాయస్థానం ముందు నిలబడి న్యాయం కోరిన ఆ క్షణం భారత న్యాయ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోయింది. ఆ పోరాటం కొన్ని రోజులు కాదు. కొన్ని నెలలు కాదు. దశాబ్దాల పాటు కొనసాగింది. ఖల్రా అదృశ్యమైన కొద్ది రోజులకే అప్పటి అకాలీ దళ్ నాయకుడు గుర్‌చరణ్ సింగ్ తోహ్రా సుప్రీంకోర్టు న్యాయమూర్తికి అత్యవసర టెలిగ్రామ్ పంపించారు. అందులో ఖల్రాను పోలీసులు తీసుకెళ్లారని పేర్కొన్నారు. సాధారణంగా టెలిగ్రామ్‌లు సమాచారం మాత్రమే ఇస్తాయి. కానీ ఈ టెలిగ్రామ్ న్యాయ చరిత్రను మలిచింది. సుప్రీంకోర్టు దాన్నే హెబియస్ కార్పస్ పిటిషన్‌గా పరిగణించింది. వెంటనే పంజాబ్ ప్రభుత్వ ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. న్యాయవ్యవస్థ ఎంత వేగంగా స్పందించగలదో ఈ ఘటన నిరూపించింది.

### • సీబీఐ దర్యాప్తు బయటపెట్టిన నిజాలు

సుప్రీంకోర్టు ఆదేశాలతో కేసు సీబీఐకి వెళ్లింది. దర్యాప్తులో ఖల్రాను అపహరించిన తర్వాత తర్న్ తారణ్ జిల్లాలోని కాంగ్ పోలీస్ స్టేషన్‌లో ఉంచినట్లు ఆధారాలు బయటపడ్డాయి. తరువాత ఆయన జాడ తెలియకుండా పోయింది. దర్యాప్తు క్రమంగా మరో పెద్ద అంశాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులుగా చూపిస్తూ వేలాది మృతదేహాలను అక్రమంగా దహనం చేసిన ఆరోపణలపై విచారణ ప్రారంభమైంది. దర్యాప్తులో వందలాది మృతదేహాల గుర్తింపులు జరిగాయి. మరెన్నో మృతదేహాల వివరాలు ఇప్పటికీ తెలియరాలేదు. ఈ నివేదిక దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసును పరిశీలించిన సుప్రీంకోర్టు సామూహిక స్థాయిలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని వ్యాఖ్యానించింది. అవసరమైన చోట్ల క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించింది. బాధిత కుటుంబాలకు పరిహారం అంశాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ పరిశీలించాలని సూచించింది. తరువాత ఖల్రా అపహరణ, హత్య కేసులో ఐదుగురు మాజీ పోలీసు అధికారులకు విధించిన జీవిత ఖైదు శిక్షను కూడా సుప్రీంకోర్టు ఖరారు చేసింది. చట్టాన్ని అమలు చేసే వ్యవస్థే చట్టాన్ని ఉల్లంఘిస్తే ప్రజాస్వామ్యానికి ఎంత ప్రమాదమో ఈ తీర్పు గుర్తు చేసింది.

### • పరమ్‌జిత్ కౌర్... మరచిపోనివ్వని పేరు

ఈ కథ కోర్టుల వరకు చేరడానికి మానవ హక్కుల కార్యకర్తలతో పాటు జర్నలిస్టుల పాత్ర కూడా ఎంతో కీలకం. అప్పటి పరిస్థితుల్లో నిజాలను వెలుగులోకి తేవడం అంటే ప్రాణాలను పణంగా పెట్టడమే. అయినప్పటికీ కొందరు పాత్రికేయులు వెనుకడుగు వేయలేదు. సాక్ష్యాలు సేకరించారు. ఆధారాలను బయటపెట్టారు. సమాజం మర్చిపోకుండా రాశారు. అలాగే రామ్ నారాయణ్ కుమార్ వంటి మానవ హక్కుల పరిశోధకులు పంజాబ్‌లో జరిగిన అదృశ్యాలపై విస్తృతంగా అధ్యయనం చేశారు. వారి రచనలు ఈ అంశాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాయి. చరిత్రలో కొందరు పోరాటం చేస్తారు. మరికొందరు ఆ పోరాటాన్ని తరతరాలకు గుర్తుండేలా నిలబెడతారు. పరమ్‌జిత్ కౌర్ రెండో వర్గానికి చెందిన వ్యక్తి. భర్త కోసం కన్నీళ్లు పెట్టుకోవడం కంటే ఆయన కల కోసం నిలబడాలని నిర్ణయించుకున్నారు. ప్రతి కోర్టు విచారణకు హాజరయ్యారు. ప్రతి పత్రాన్ని సంరక్షించారు. ప్రతి ప్రశ్నకు సమాధానం వెతికారు. వ్యక్తిగత విషాదాన్ని సామాజిక ఉద్యమంగా మార్చిన మహిళగా ఆమె నిలిచిపోయారు.

### • సట్లుజ్ ఎందుకు ప్రత్యేకం?

సట్లుజ్ సినిమా ఒక్క వ్యక్తి జీవితాన్ని మాత్రమే చూపించదు. ఒక కాలాన్ని చూపిస్తుంది. ఒక రాష్ట్రం ఎదుర్కొన్న మౌనాన్ని వినిపిస్తుంది. చరిత్ర పుస్తకాలలో రెండు పంక్తులుగా మిగిలిపోయిన సంఘటనలను కళ్లముందు నిలబెడుతుంది. యువతకు తెలియని అధ్యాయాన్ని తెరపై ఆవిష్కరిస్తుంది. అందుకే ఈ సినిమా విడుదల సాధారణ సినీ సంఘటనగా కాకుండా సామాజిక చర్చగా మారింది. సినిమా విడుదలైన కొద్ది రోజులకే ఓటీటీ నుంచి తొలగించడం కొత్త ప్రశ్నలకు దారి తీసింది. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై చర్చ మొదలైంది. చరిత్రను చూపించే చిత్రాలకు ఎందుకు ఇన్ని అడ్డంకులు వస్తున్నాయనే ప్రశ్నలు వినిపించాయి. సినిమా నచ్చినా నచ్చకపోయినా చూడాలా వద్దా అనేది ప్రేక్షకుడి నిర్ణయం కావాలనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... సినిమా తొలగించిన తర్వాతే దాని గురించి దేశవ్యాప్తంగా మరింత చర్చ జరిగింది. నిలిపివేయాలని చూసిన కథ మరింత దూరం ప్రయాణించింది.

### • సత్యం ఆగదు... ప్రయాణమే మారుతుంది

పంజాబ్‌లో ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న సమయంలో ఈ సినిమా రావడం రాజకీయ చర్చకు కూడా కారణమైంది. అధికార పక్షం, ప్రతిపక్షం తమ తమ కోణాల్లో స్పందించాయి. అయినప్పటికీ ఈ కథను కేవలం ఎన్నికల కోణంలో చూడడం సరైంది కాదని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. ఎందుకంటే ఇది ఓటు రాజకీయాల కంటే పెద్దది. మానవ హక్కులు, ప్రభుత్వ బాధ్యత, ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే కథ. ఒకప్పుడు సట్లుజ్ అంటే పంజాబ్ నేలను సేద్యం చేసిన నది గుర్తుకొచ్చేది. ఇప్పుడు అదే పేరు మరో అర్థాన్ని సంతరించుకుంది. అది మౌనాన్ని ఛేదించిన స్వరం. మరచిపోనివ్వని జ్ఞాపకం. చరిత్రను నిలబెట్టిన ధైర్యం. ఒక మనిషి అదృశ్యమైనా ఆయన అడిగిన ప్రశ్నలు అదృశ్యం కాలేదని చెప్పే ప్రతీక. సత్యాన్ని కొంతకాలం దాచిపెట్టవచ్చు. చర్చను వాయిదా వేయవచ్చు. సినిమాను నిలిపివేయవచ్చు. కానీ ప్రశ్నలను ఆపలేరు. జస్వంత్ సింగ్ ఖల్రా జీవితం అదే చెబుతోంది. ఒక మనిషి కనిపించకుండా పోయాడు. కానీ ఆయన వెతికిన నిజాలు సమాజం ముందే నిలిచిపోయాయి. ఒక సినిమా ఆగిపోయింది. కానీ దాని వెనుక ఉన్న చరిత్ర మరింత బలంగా వినిపిస్తోంది. నదిని ఆనకట్టతో ఆపవచ్చు. ప్రవాహాన్ని శాశ్వతంగా బంధించలేరు. అదే విధంగా సత్యాన్ని కొంతకాలం మసకబార్చవచ్చు. శాశ్వతంగా చెరిపేయలేరు. చరిత్ర చివరకు తన గొంతును తానే వెతుక్కుంటుంది. నిజం ఆలస్యంగా నడిచినా గమ్యం మాత్రం ఎప్పుడూ చేరుకుంటుంది. అదే 'సట్లుజ్' చెప్పిన గొప్ప సందేశం.

### • చరిత్రకు ముగింపు లేదు... సత్యానికి సమాధి ఉండదు

చరిత్రను పుస్తకాలలో బంధించవచ్చు. సినిమాలను తెరల నుంచి తొలగించవచ్చు. పత్రాలను దాచిపెట్టవచ్చు. సాక్ష్యాలను చెరిపేయాలని ప్రయత్నించవచ్చు. కానీ ప్రజల జ్ఞాపకాలలో నిలిచిపోయిన సత్యాన్ని ఎవరూ చెరిపేయలేరు. 'సట్లుజ్' ఇప్పుడు ఒక సినిమా పేరు కాదు. ప్రశ్నించే మనసుకు ప్రతీక. మౌనంగా మిగిలిపోయిన వేలాది కుటుంబాల గొంతుక. జస్వంత్ సింగ్ ఖల్రా జీవితం ముగిసింది. ఆయన పోరాటం ముగియలేదు. కోర్టు తీర్పులు వచ్చాయి. చరిత్ర తీర్పు మాత్రం ఇంకా కొనసాగుతోంది. ప్రతి తరం ఈ కథను కొత్త కోణంలో చదువుతుంది. కొత్త ప్రశ్నలు అడుగుతుంది. కొత్త సమాధానాల కోసం వెతుకుతుంది. అందుకే ఈ గాథకు ముగింపు లేదు. ఇది ఒక రాష్ట్ర చరిత్ర మాత్రమే కాదు. ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం ఎప్పటికీ సజీవంగా ఉండాలనే హెచ్చరిక. సత్యం ఒక్కసారి గెలవడం కాదు. ప్రతి తరంలో మళ్లీ మళ్లీ తనను తాను నిరూపించుకోవాల్సి వస్తుంది. అందుకే సత్యాన్ని ఆపగలరా? అనే ప్రశ్నకు కాలమే ఒక సమాధానం చెబుతోంది. సత్యాన్ని ఆలస్యం చేయవచ్చు... సత్యాన్ని మౌనంలో నెట్టవచ్చు... సత్యాన్ని వివాదాల్లో చిక్కించవచ్చు... కానీ సత్యాన్ని ఓడించలేరు. జస్వంత్ సింగ్ ఖల్రా లేవనెత్తిన ప్రశ్నలు ఇంకా బతికే ఉన్నాయి. సత్యం ప్రశ్నిస్తూనే ఉంటుంది... చరిత్ర ముందుకు సాగుతూనే ఉంటుంది.


---

# ఇసుక దోపిడీపై చర్యలు తీసుకోండి..

- కలెక్టర్, ఎస్పీలకు ఆమంచి ఫిర్యాదు
- కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో వందల కోట్ల అక్రమ తవ్వకాలా?
- 30 ఎకరాల్లో 40 అడుగుల మేర తోడేశారు.. రూ.100 కోట్ల జరిమానా విధించాలి
- అక్రమాల్లో ఏఆర్ కానిస్టేబుల్ వెంకట్ హస్తం.. సమగ్ర విచారణ జరపాలని డిమాండ్

**బాపట్ల, జూలై 6 (నాదేశం):** చీరాల నియోజకవర్గం చీరాల మండలం కావూరివారిపాలెంలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు జరిపే వారి పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని చీరాల మాజీ శాసనసభ్యులు ఆమంచి కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌ను, అనంతరం జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావును కలిసి వినతిపత్రాలు అందజేశారు.

బాపట్ల జిల్లా కలెక్టరేట్‌కు కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలోనే గత కొన్ని నెలలుగా ఇంత భారీగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులకు తెలియకపోవడం శోచనీయమని ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. అధికారులు జిల్లా కలెక్టర్‌ను పూర్తిగా తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి అయిన ఏఆర్ కానిస్టేబుల్ వెంకట్ కావూరివారిపాలెంలో ఏకంగా 40 అడుగుల మేర ఇసుక తవ్వకాలు జరుపుతూ అవినీతికి పాల్పడుతుంటే జిల్లా యంత్రాంగం ఏం చేస్తోందని ఆయన నిలదీశారు.



### రూ.100 కోట్ల జరిమానా విధించాలి

సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో వందల కోట్ల రూపాయల మేర అక్రమ ఇసుక వ్యాపారం జరిగిన ఈ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించాలని, బాధ్యులకు రూ. 100 కోట్ల మేర జరిమానా విధించాలని ఆమంచి డిమాండ్ చేశారు. తాము ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా, కేవలం ప్రజా ప్రయోజనాల కోసమే ఈ దోపిడీని ప్రశ్నిస్తున్నామని స్పష్టం చేశారు. కలెక్టర్ వినోద్ కుమార్ ఈ అక్రమ తవ్వకాలను నిలిపివేస్తారనే నమ్మకంతో ఉన్నామని, ఒకవేళ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ప్రజలతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఆమంచి హెచ్చరించారు.

### సమగ్ర విచారణకు డిమాండ్

అనంతరం జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావును కలిసిన ఆమంచి.. అక్రమ ఇసుక తవ్వకాల్లో ఏఆర్ కానిస్టేబుల్ వెంకట్ పాత్రపై పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ ఇసుక మాఫియాతో చేతులు కలిపిన సదరు కానిస్టేబుల్ వ్యవహారంపై తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.

---

# అప్పుల ఉచ్చు

- హృదయ విదారక ఘటన
- ప్రాణాలు తీసిన అప్పుల భారం
- అమ్మిన ఇంట్లోనే జీవితాలు అంతం

జీవితాన్ని నిలబెట్టుకోవడానికి ఎంత ప్రయత్నించినా పరిస్థితులు అనుకూలించకపోతే కుటుంబాలు ఎంతటి విషాదకర నిర్ణయాలు తీసుకుంటాయో కర్ణాటకలోని గంగావతిలో జరిగిన ఘటన మరోసారి గుర్తు చేసింది. ఒకప్పుడు తమ సొంతిల్లు అయిన ఇంటిని అప్పుల కోసం విక్రయించిన కుటుంబం, చివరకు అదే ఇంట్లో జీవితానికి ముగింపు పలకడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటన తెలిసిన ప్రతి ఒక్కరూ దిగ్భ్రాంతికి గురయ్యారు.

### వ్యాపార నష్టాలతో కుదేలైన కుటుంబం

కుటుంబ పెద్ద వ్యాపారంలో వరుస నష్టాలను ఎదుర్కొన్నారు. ఆదాయం తగ్గిపోవడం, అప్పులు పెరిగిపోవడం వల్ల ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతింది. అప్పులు తీర్చేందుకు ఎన్నో మార్గాలు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. చివరకు సొంత ఇంటిని విక్రయించి అద్దె ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ అప్పుల భారం తగ్గకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యారు. భవిష్యత్తుపై ఉన్న ఆశలు క్రమంగా మసకబారాయి. తీవ్ర మనోవేదనలో ఉన్న దంపతులు తమ ఇంజినీరింగ్ చదువుతున్న కుమారుడితో కలిసి విషాదకర నిర్ణయం తీసుకున్నారు. అద్దె ఇంటి నుంచి బయటకు వెళ్లి



గతంలో విక్రయించిన ఇంటికి చేరుకున్నారు. వెనుక తలుపు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన ముగ్గురూ అక్కడే ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### కష్టాలకు పరిష్కారం జీవితం

ఈ ఘటన కేవలం ఒక కుటుంబానికి జరిగిన విషాదం మాత్రమే కాదు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల ఒత్తిడి, మానసిక ఆందోళనలు కలిసి ఎంతటి ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తాయో స్పష్టంగా చూపించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న వారికి ఆర్థిక సహాయం మాత్రమే కాదు, మానసిక ధైర్యం కూడా ఎంతో అవసరం. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజం అండగా నిలిస్తే ఇలాంటి విషాదాలను చాలా వరకు నివారించవచ్చు. ఒకప్పుడు నవ్వులతో కళకళలాడిన ఇంట్లో చివరకు విషాదం మాత్రమే మిగిలింది. కష్టాలు జీవితంలో భాగమే అయినా వాటికి శాశ్వత పరిష్కారం ప్రాణాలను కోల్పోవడం కాదని ఈ ఘటన గుర్తు చేస్తోంది. సమస్యలు ఎంత పెద్దవైనా వాటిని పంచుకోవడం, సాయం కోరడం, ధైర్యంగా ఎదుర్కోవడం ఎంతో ముఖ్యం. క్షణిక ఆవేశంలో తీసుకునే నిర్ణయం కుటుంబాలను శాశ్వత విషాదంలోకి నెట్టేస్తుందని ఈ సంఘటన మరోసారి హెచ్చరిస్తోంది.



# తగ్గిన ప్రాభవం
## వచ్చేనా.. పూర్వ వైభవం

- పోయిన చోటే వెదుక్కునే పనిలో జగన్
- వైఎస్ కుటుంబానికి రాజకీయ అడ్డా కడప
- సమీకరణాలు మార్చేసిన 2024 ఎన్నికలు
- హెచ్చరికగా ఉపఎన్నికల ఫలితాలు
- కడపపై ఫుల్ ఫోకస్ పెట్టిన వైసీపీ అధినేత
- నేటి నుంచి రెండు రోజుల పాటు కడపలో జగన్..
- కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపే ప్రయత్నం
- కూటమి విభేదాలపై ఫ్యాన్ పార్టీ నజర్
- రాజకీయ గడపపై పట్టు సాధించే వ్యూహం
- సొంత ఇంటిని చక్కబెట్టే పనిలో వైఎస్ జగన్

**2024 ఎన్నికల ఫలితాల తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పొలిటికల్ స్ట్రాటజీని రీఎలైన్ చేస్తున్నారా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ఎదుర్కొన్న ఎదురుదెబ్బతో పాటు, ఒకప్పుడు అజేయంగా భావించిన ఉమ్మడి కడప జిల్లాలోనూ పార్టీ ప్రభావం తగ్గడం.. అక్కడ పార్టీ నాయకులంతా అధికార పక్షంలో చేరిపోవడంతో ఆయన ఇప్పుడు కొత్త వ్యూహాల వైపు అడుగులు వేస్తున్నట్టు కన్పిస్తున్న. అందుకే ముందుగ సొంత అడ్డాలో పార్టీని బలోపేతం చేసి, అక్కడి నుంచే పార్టీ పునర్నిర్మాణాన్ని ప్రారంభించాలని జగన్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. వైఎస్ కుటుంబానికి ఉమ్మడి కడప జిల్లా ఎన్నో దశాబ్దాలుగా రాజకీయంగా అండగా నిలిచింది. 2019 ఎన్నికల్లో జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలను గెలుచుకున్న వైసీపీ, 2024లో మూడంటే మూడు స్థానాలకే పరిమితమైంది. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల ఫలితాలు కూడా పార్టీకి హెచ్చరికగా మారాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాల తర్వాత జగన్ తరచూ కడప జిల్లాలో పర్యటిస్తూ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కడపలో కోల్పోయిన రాజకీయ ఆధిపత్యాన్ని తిరిగి సాధించాలనే లక్ష్యంతో జగన్ అడుగులు వేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఈ వ్యూహాలు ఎంతవరకు ఫలిస్తాయి, కడప రాజకీయాల్లో మళ్లీ పాత పరిస్థితులు వస్తాయా అనే ప్రశ్నలను విశ్లేషిస్తోంది ఈ కథనం**

కడపంటే.. వైఎస్. వైఎస్ అంటే కడప. ఆ కుటుంబానికి ఇదొక చెక్కుచెదరని కోట. చంద్రబాబుకు చిత్తూరు.. కోట్ల కుటుంబానికి కర్నూలు.. జేసీ ఫ్యామిలీకి అనంతపురం జిల్లాలు సొంతం అవునో కాదో.. తెలీదు గానీ.. రాష్ట్ర ముఖచిత్రంలో కడప.. వైఎస్ కుటుంబానికి దశాబ్దాల నాటి నుంచి పొలిటికల్ పాంచజన్యమే.. ఇది ఎవరు ఔనన్నా.. కాదన్నా.. కచ్చితంగా చెప్పుకోవాల్సిన అంశమే.. అలాంటి రాజకీయ గడప ఏపీ రాజకీయాల్లో ఎన్నటికీ ఒక ప్రత్యేక గుర్తింపు పొందిన పౌరుషాల గడ్డ. వైఎస్ కుటుంబానికి అడ్డాగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా నిలిచిన ఈ ప్రాంతం రాజకీయంగా ఎప్పుడూ ప్రత్యేక చర్చకు కేంద్రబిందువే అవుతుండటం కీలకమైన అంశం. ఒకప్పుడు ఉమ్మడి కడప జిల్లాలో ప్రత్యర్థి పార్టీలకు అవకాశమే లేకుండా సాగిన వైఎస్ కుటుంబ ప్రభావం, 2024 ఎన్నికల తర్వాత కొత్త రాజకీయ సమీకరణాలకు వేదికగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా ఎదురైన ఓటమితో పాటు సొంత జిల్లాలో కూడా పార్టీ ప్రభావం తగ్గడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆలోచనలో పడేసిందనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ప్రత్యేకంగా పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల ఫలితాలు వైసీపీ నాయకత్వానికి హెచ్చరిక సైరన్‌గా మారిందని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. అందుకే ఇప్పుడు జగన్ తన దృష్టిని పూర్తిగా సొంత జిల్లా కడపపై కేంద్రీకరించినట్లు కనిపిస్తోంది. రాష్ట్ర రాజకీయాలపై దృష్టి సారిస్తూనే.. అంతకు ముందుగా సొంత ఇంటిని చక్కబెట్టుకునే వ్యూహానికి దగ్గరవుతున్నారు. వివిధ సందర్భాల్లో ఆయన తరచూ కడపకు వస్తూ రోజుల తరబడి ఉంటున్నారు.. చాలా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందరినీ పలకరిస్తూ ఆప్యాయంగా దగ్గరవుతున్నారు..

### కడప కంచుకోటలో వైఎస్ కుటుంబానికి కొత్త సవాళ్లు

ఉమ్మడి కడప జిల్లా రాజకీయ చరిత్రలో వైఎస్ కుటుంబం ఒక ప్రత్యేక అధ్యాయం. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయ ప్రయాణం నుంచి ప్రారంభమైన ఈ ప్రభావం, తర్వాత జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో కూడా కొనసాగింది. 2014 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అధికారాన్ని కోల్పోయినా కడప జిల్లాలో వైసీపీ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. 2019 ఎన్నికల్లో అయితే జిల్లాలో దాదాపు సంపూర్ణ ఆధిపత్యాన్ని సాధించింది. ఆ ఎన్నికల్లో ఉమ్మడి కడప జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో పది స్థానాలు గెలుచుకోవడం ద్వారా వైసీపీ తన బలాన్ని నిరూపించింది. పులివెందుల, బద్వేలు, కమలాపురం, జమ్మలమడుగు, మైదుకూరు, కడప, రాయచోటి, రాజంపేట, కోడూరు, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లో వైసీపీ విజయం సాధించింది. దీంతో రాజకీయ పరిశీలకులు "కడప అంటే వైఎస్ కుటుంబం... వైఎస్ కుటుంబం అంటే కడప" అనే స్థాయిలో చాలా సార్లు విశ్లేషణలు చేసుకున్న దాఖలాలున్నాయి. కడపలో ఆ కుటుంబానికి ఎదురే లేదని లెక్కలేసుకున్నారు. అయితే 2024 ఎన్నికలు ఉమ్మడి కడప జిల్లా రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభంజనం ప్రభావం కడప జిల్లాపై కూడా పడింది. మొత్తం పది అసెంబ్లీ స్థానాల్లో కూటమి ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. అందులో ఐదు స్థానాలు తెలుగుదేశం పార్టీ గెలుచుకోగా, ఒక స్థానం జనసేన పార్టీ, మరో స్థానం భారతీయ జనతా పార్టీ ఖాతాలోకి వెళ్లాయి. వైసీపీ కేవలం మూడంటే మూడు స్థానాలకు మాత్రమే పరిమితమైంది. ఈ ఫలితాలు రాజకీయంగా వైసీపీకి పెద్ద సందేశాన్ని ఇచ్చాయి. ఒకప్పుడు ప్రత్యర్థులకు అందనంత దూరంలో ఉన్న వైఎస్ కుటుంబ రాజకీయ ప్రభావం ఇప్పుడు సవాళ్లను ఎదుర్కొంటోందనే భావన బలపడుతూ వచ్చింది.

### కూటమి విభేదాలపై ఫుల్ ఫోకస్

ప్రస్తుతం ఉమ్మడి కడప జిల్లాలో అధికార కూటమికి చెందిన పార్టీల్లో అంతర్గత విభేదాలు ఉన్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో బలంగానే వినిపిస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లో నాయకుల మధ్య ఆధిపత్య పోరు, పదవుల పంపకాలపై అసంతృప్తి, స్థానిక స్థాయిలో సమన్వయ లోపం వంటి అంశాలు చాలా రకాలుగా బయటపడుతున్నాయి. ఈ పరిస్థితిని రాజకీయ అవకాశంగా మలచుకోవాలని వైసీపీ భావిస్తున్నట్లు సమాచారం. ప్రత్యర్థి పార్టీల్లో ఉన్న విభేదాలను తమకు అనుకూలంగా మలచుకోవడం ద్వారా తిరిగి బలం పెంచుకోవచ్చని పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. జగన్ ప్రస్తుతం ఎక్కువగా దృష్టి పెడుతున్న అంశాల్లో కార్యకర్తల బలోపేతం ఒకటి. ఎన్నికల ఓటమి తర్వాత నిరుత్సాహానికి గురైన పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. పార్టీ సమావేశాలు, వ్యక్తిగతంగా నాయకులతో చర్చలు, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వడం ద్వారా కేడర్‌ను మళ్లీ చురుకుగా మార్చాలనే ప్రయత్నం సాగుతోంది.

### ఉపఎన్నికల ఫలితాలతో వైఎస్ జగన్ అప్రమత్తం

వైసీపీ ఓటమిపై అనేక కారణాలు విశ్లేషణకు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వ్యతిరేకత, అభ్యర్థులపై స్థానిక అసంతృప్తి, కూటమి వ్యూహం, ఓటర్లలో మార్పు కోరుకున్న భావన వంటి అంశాలు కలిసి ప్రభావం చూపినట్లు భావిస్తున్నారు. అయితే కడప జిల్లాలో పరిస్థితి మరింత భిన్నంగా కనిపించింది. ఇక్కడ పార్టీపై కంటే స్థానిక నాయకత్వంపై అసంతృప్తి ఎక్కువగా ఉందనే అభిప్రాయం కొంతమంది రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో వర్గపోరు, నాయకుల మధ్య సమన్వయ లోపం, కార్యకర్తలకు అందని నాయకత్వం వంటి అంశాలు కూడా ఫలితాలపై ప్రభావం చూపాయని చెబుతున్నారు. ఇటీవల జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల్లో వైసీపీకి ఫలితాలు దూరమవ్వక తప్పని పరిస్థితి. ఆ ఓటమి రాజకీయంగా, మాత్రం తీవ్ర ప్రభావం పాటు.. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. స్థానిక ఎన్నికల ఫలితాలు సాధారణంగా ప్రాంతీయ రాజకీయ వాతావరణానికి అద్దం పడతాయని భావిస్తారు. అలాంటి సమయంలో వచ్చిన ఫలితాలు పార్టీ శ్రేణుల్లో ఆందోళన పెంచినట్లు తెలుస్తోంది. అలాగే పులివెందుల వంటి వైఎస్ కుటుంబ బలమైన ప్రాంతాల్లో కూడా గతంతో పోలిస్తే రాజకీయ పరిస్థితులు మారుతున్నాయనే సంకేతాలు కనిపించడంతో పార్టీ నాయకత్వం మరింత అప్రమత్తమైంది.

### గ్రౌండ్ లెవల్లో పార్టీ బలోపేతంపై జగన్ ఫోకస్

2024 ఎన్నికల తర్వాత జగన్ వ్యవహారశైలిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. ఒకప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలపై దృష్టి పెట్టిన ఆయన ఇప్పుడు జిల్లా స్థాయి నాయకత్వాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తున్నారు. వచ్చే ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే గ్రౌండ్ లెవల్‌లో పార్టీని బలోపేతం చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అందులో భాగంగా తరచూ పులివెందులకు రావడం, పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహించడం, స్థానిక సమస్యలపై ఆరా తీయడం వంటి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ప్రజాదర్బార్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ సొంత నియోజకవర్గంలో జనానికి దగ్గరవుతున్నారు. జగన్ రాజకీయ జీవితానికి పులివెందుల ఒక భావోద్వేగ కేంద్రం. ఆయన రాజకీయ ప్రస్థానం, కుటుంబ వారసత్వం, పార్టీ బలం అన్నీ ఈ నియోజకవర్గంతో ముడిపడి ఉన్నాయి. అందుకే ప్రస్తుతం ఆయన ఎక్కువగా పులివెందుల రాజకీయాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారని చెబుతున్నారు. పులివెందులలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడం, యువతను ఆకర్షించడం, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపడం వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

### 2029 లక్ష్యంగా కడపలో జగన్ రీ-ఎంట్రీ వ్యూహాలు

జగన్ కడప పర్యటనల్లో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడం కూడా కనిపిస్తోంది. ఇవి కేవలం కార్యక్రమాలే కాదు, రాజకీయంగా ప్రజలకు చేరువయ్యే ప్రయత్నంగా కూడా విశ్లేషిస్తున్నారు. ఎన్నికల తర్వాత ప్రజల్లో ఏర్పడిన దూరాన్ని తగ్గించి మళ్లీ విశ్వాసాన్ని పొందేందుకు ఇది ఉపయోగపడుతుందని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం వైసీపీ ముందున్న ప్రధాన లక్ష్యం 2029 ఎన్నికలు. 2024 ఫలితాలను ఒక గుణపాఠంగా తీసుకుని భవిష్యత్ వ్యూహాలను రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రత్యేకంగా కడప జిల్లాలో కోల్పోయిన ఆధిపత్యాన్ని తిరిగి సాధించాలంటే ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో బలపడాల్సిన అవసరం ఉందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. అందుకే నాయకత్వం నుంచి కార్యకర్తల వరకు అందరూ సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి కడప జిల్లా రాజకీయాలు ఎప్పుడూ రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపుతూనే ఉన్నాయి. ఇక్కడ జరిగే మార్పులు భవిష్యత్‌లో రాష్ట్ర రాజకీయాలకు దిశానిర్దేశం చేసే అవకాశమూ ఉంది. ప్రస్తుతం కూటమి బలంగా కనిపిస్తున్నప్పటికీ రాజకీయాల్లో పరిస్థితులు ఎప్పుడైనా మారే అవకాశాలు లేకపోవచ్చు. అదే సమయంలో వైసీపీ కూడా తన బలహీనతలను గుర్తించి పునర్నిర్మాణ దిశగా అడుగులు వేస్తోంది. జగన్ స్వయంగా రంగంలోకి దిగడం, సొంత జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టడం, కార్యకర్తలను మళ్లీ చైతన్యవంతం చేయడం వంటి చర్యలు భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముంది.

### ఇంట గెలిచి రచ్చ గెలవాలన్న ప్రణాళికతో అడుగులు

ఒకప్పుడు తిరుగులేని కంచుకోటగా ఉన్న ఉమ్మడి కడప జిల్లా ఇప్పుడు రాజకీయ పోటీకి వేదికగా మారింది. 2024 ఎన్నికల ఫలితాలు వైసీపీకి గట్టి హెచ్చరికగా మారగా, అదే సమయంలో పార్టీ పునర్నిర్మాణానికి అవకాశాన్ని కూడా కల్పించాయి. ఈ పరిస్థితిని జగన్ ఎంత సమర్థంగా ఉపయోగించుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. సొంత జిల్లాలో కోల్పోయిన పట్టు తిరిగి సాధించాలనే సంకల్పంతో జగన్ ముందుకు సాగుతున్నారు. పులివెందుల నుంచి మొత్తం ఉమ్మడి కడప జిల్లాపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ప్రత్యర్థి పార్టీల్లోని అంతర్గత విభేదాలు, స్థానిక రాజకీయ పరిణామాలు, కార్యకర్తల ఉత్సాహం, ప్రజల స్పందన... ఇవన్నీ కలిపి రాబోయే సంవత్సరాల్లో కడప రాజకీయాలను నిర్ణయించబోతున్నాయి. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఉమ్మడి కడప జిల్లాలో రాజకీయ పోరు ఇంతటితో ముగిసిందనుకుంటే పొరబాటే. అది కేవలం కొత్త దశలోకి ప్రవేశించింది. ఈ పోరులో జగన్ మళ్లీ తన పాత ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడం వైపే అడుగులు వేస్తున్నట్టు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. అయితే ఇదే సమయంలో 2024 నాటి ఫలితాలను కూటమి మళ్లీ అందుకోవడంతో పాటు.. పట్టును మరింత బలోపేతం చేసుకుంటుందా? అన్న అంశాలపై సైతం పరిశీలకులు మౌనంగా కూని రాగాలు తీస్తున్నారు. ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానం రాబోయే రోజుల్లో మాత్రమే లభించనుంది. ఉమ్మడి కడప రాజకీయాల అధ్యాయం ముమ్ముందు ఎలా ఉండబోతుందో అన్నది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. కడపంటే వైఎస్ కుటుంబానిదేనా..! జగన్ 2029 నాటికి పూర్వ వైభవాన్ని సంతరించుకుంటారా.. కడప జనాలతో పాటు యావత్తు రాష్ట్రం ఎదురుచూస్తోంది.

— హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్

# మనుషులు శాశ్వతం కాదు

- ట్రంప్‌కు మెలోనీ కౌంటర్
- ట్రంప్ వ్యాఖ్యలపై పీక్‌కు రగడ
- బంధాలే శాశ్వతమని స్పష్టం
- సోషల్ మీడియా పోస్టుతో దుమారం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన సోషల్ మీడియా పోస్ట్ అమెరికా-ఇటలీ సంబంధాలపై చర్చకు దారితీసింది. ట్రూత్ సోషల్ వేదికగా ఇటలీ ప్రధాని జార్జియో మెలోనీ చిత్రాన్ని మార్ఫింగ్ చేసి పోస్టు చేశారు. ఆ పోస్టుకు "రెస్ట్రైనింగ్ ఆర్డర్ అవసరం" అనే వ్యాఖ్యను జత చేయడం రాజకీయంగా వివాదాస్పదమైంది. ఈ పరిణామం నాటో సదస్సుకు ముందు చోటుచేసుకోవడం అంతర్జాతీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తించింది.

### ఇటలీ ఘాటు స్పందన

ట్రంప్ వ్యాఖ్యలపై ఇటలీ ప్రభుత్వం ఘాటుగా స్పందించింది. ఇటలీ రక్షణ మంత్రి క్రెసెట్టో మాట్లాడుతూ వ్యక్తులు వస్తుంటారు, వెళ్తుంటారు కానీ దేశాల మధ్య సంబంధాలు శాశ్వతంగా కొనసాగాలని అన్నారు. విదేశాంగ మంత్రి టజానీ కూడా వ్యక్తిగత వ్యాఖ్యలు రెండు దేశాల వ్యూహాత్మక సంబంధాలను ప్రభావితం చేయవని స్పష్టం చేశారు. అయితే మెలోనీ మాత్రం ఈ తాజా వ్యాఖ్యలపై నేరుగా స్పందించలేదు.

### ముందు నుంచే విమర్శలు

గత నెల జీ7 సదస్సు తర్వాత కూడా ట్రంప్ మెలోనీపై విమర్శలు చేశారు. ఫొటో దిగేందుకు మెలోనీ తనను కోరారని ఆరోపించారు. అమెరికా చర్యలకు ఇటలీ మద్దతు ఇవ్వకపోవడంతో వాషింగ్టన్‌తో సంబంధాలను మెరుగుపర్చేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారని కూడా వ్యాఖ్యానించారు. ఆ సమయంలో మెలోనీ అలాంటి ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ, స్నేహితురాలిగా ఉండటం వల్ల తనకు రాజకీయంగా ప్రయోజనం కలగలేదని బదులిచ్చారు.



**పదవులు ఉంటాయి.. పోతాయి... నాయకులు వస్తారు.. వెళ్తారు. కానీ దేశాల మధ్య బంధాలు ఒక్క పోస్టుతో తెగిపోవు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ అట్లాంటిక్‌కు ఇరువైపులా రాజకీయ ప్రకంపనలు రేపింది. వ్యక్తిగత వ్యాఖ్యలతో మొదలైన ఈ వివాదానికి ఇటలీ మాత్రం ఒకే మాటతో కౌంటర్ ఇచ్చింది. "మనుషులు శాశ్వతం కాదు.. దేశాల మధ్య బంధాలే శాశ్వతం" అంటూ ట్రంప్ వ్యాఖ్యలకు గట్టి సందేశం పంపింది. నాటో సమావేశానికి ముందు ఈ పరిణామం అమెరికా-యూరప్ సంబంధాలపై కొత్త చర్చకు తెరతీసింది.**

### నాటో సమావేశంపై ప్రభావం

ఈ వారంలో జరగనున్న నాటో సమావేశానికి ముందు ట్రంప్ వరుస వ్యాఖ్యలు యూరప్ దేశాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికే నాటో సభ్య దేశాల రక్షణ వ్యయాలపై ట్రంప్ తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అమెరికా-యూరప్ సంబంధాలు మరింత సున్నితంగా మారే అవకాశం ఉందని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు భావిస్తున్నారు. అయితే వ్యక్తిగత వ్యాఖ్యల కంటే వ్యూహాత్మక భాగస్వామ్యానికే రెండు దేశాలు ప్రాధాన్యం ఇస్తాయని ఇటలీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# వామ్మో.. ఏఐ

- భారీగా ఉద్వాసనలు
- మైక్రోసాఫ్ట్‌లో 4,800 ఉద్యోగాల కోత



**ఇది కేవలం మైక్రోసాఫ్ట్‌లో 4,800 ఉద్యోగాల కోత కథ కాదు... రేపటి ప్రపంచ ఉద్యోగ విపణికి వినిపిస్తున్న హెచ్చరిక గంట. ఒకప్పుడు మనిషి చేసే పనిని యంత్రం చేయలేదనుకునేవారు. ఇప్పుడు అదే యంత్రం... మనిషి స్థానాన్నే భర్తీ చేసే దశకు చేరుకుంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై వందల బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెరుగుతున్న వేళ... వేలాది ఉద్యోగాలు ఒక్కొక్కటిగా మాయమవుతున్నాయి. మైక్రోసాఫ్ట్ తీసుకున్న నిర్ణయం ప్రపంచ టెక్ రంగంలో కొత్త అలజడికి నాంది పలికింది. మరి రాబోయే రోజుల్లో ఏఐ సృష్టించే అవకాశాలు ఎక్కువా... లేక ఉద్యోగాలపై ముప్పే ఎక్కువా? ఇప్పుడు చూద్దాం ఈ ప్రత్యేక కథనం.**

మైక్రోసాఫ్ట్ తన ఉద్యోగుల్లో సుమారు 4,800 మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. సంస్థ మొత్తం ఉద్యోగుల్లో ఇది దాదాపు 2.1 శాతం. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధిపై భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలోనే అమెరికాలోని ఉద్యోగుల్లో సుమారు 9 వేల మందికి స్వచ్ఛంద విరమణ అవకాశాన్ని కూడా కల్పించింది.

### ఏఐ పెట్టుబడుల ఒత్తిడి

ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ సంస్థలు కృత్రిమ మేధస్సుపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ ఏడాది బిగ్ టెక్ కంపెనీల ఏఐ పెట్టుబడులు 700 బిలియన్ డాలర్లకు మించి ఉండొచ్చని అంచనాలు ఉన్నాయి. ఈ భారీ వ్యయాన్ని సమతుల్యం చేయడానికి సంస్థలు ఖర్చులను తగ్గించే చర్యలు చేపడుతున్నాయి. ఇప్పటికే అమెజాన్, మెటా ప్లాట్‌ఫామ్స్ సైతం వేలాది ఉద్యోగులను తొలగించాయి.

### డేటా సెంటర్లపై భారీ వ్యయం

ఏఐ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌తో మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ సేవలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఈ సేవలను నిర్వహించడానికి కొత్త డేటా సెంటర్ల నిర్మాణంపై సంస్థ భారీగా ఖర్చు చేస్తోంది. 2026లో సుమారు 190 బిలియన్ డాలర్ల వరకు వ్యయం ఉండొచ్చని మైక్రోసాఫ్ట్ ఇప్పటికే అంచనా వేసింది. ఇదే సమయంలో ఏఐ సాధనాలు అనేక సాధారణ కార్యాలయ పనులను ఆటోమేటిక్‌గా నిర్వహించే స్థాయికి చేరుకోవడంతో సంస్థల ఉద్యోగ విధానాలు కూడా మారుతున్నాయి.

### టెక్ రంగంలో కొత్త దిశ

2026 తొలి ఆరు నెలల్లో మైక్రోసాఫ్ట్ షేర్లు గణనీయంగా పడిపోవడం కూడా సంస్థపై ఒత్తిడిని పెంచింది. డేటా సెంటర్ల అవసరాల కారణంగా మెమరీ చిప్‌ల ధరలు పెరగడం, గేమింగ్ విభాగంలో డిమాండ్ మందగించడం కూడా ప్రభావం చూపుతున్నాయి. టెక్నాలజీ రంగంలో ఏఐ విస్తరణ కొత్త అవకాశాలను తీసుకొస్తున్నప్పటికీ, అదే సమయంలో సంప్రదాయ ఉద్యోగాలపై ప్రభావం చూపుతున్నదనే చర్చ మరింత బలపడుతోంది.

# వైభవ్ అరంగేట్రం ఆనందమే

◆ కానీ శాంసన్‌ను మరవొద్దు
◆ సంజూ శాంసన్‌కు మద్దతుగా
మాజీ క్రికెటర్ల స్వరం

భారత యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ టీ20 జట్టులో అరంగేట్రం చేయడం పట్ల మాజీ క్రికెటర్లు హర్షం వ్యక్తం చేశారు. అయితే అదే సమయంలో సంజూ శాంసన్‌ను తుది జట్టులోకి తీసుకోకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తారు. మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ స్పందిస్తూ, శాంసన్ గాయపడకపోతే అతడిని తప్పించడం ఆశ్చర్యకర నిర్ణయమని వ్యాఖ్యానించారు. వైభవ్‌కు అవకాశం ఇవ్వాలనుకుంటే శాంసన్‌ను మూడో స్థానంలో బ్యాటింగ్‌కు పంపవచ్చని సూచించారు. అరంగేట్ర మ్యాచ్‌లో వైభవ్ 10 బంతుల్లో 14 పరుగులు చేసి రెండు భారీ సిక్సర్లు బాదాడు. మరోవైపు మాజీ బ్యాటర్ అంబటి రాయుడు కూడా శాంసన్‌కు మద్దతుగా నిలిచారు. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్‌లో శాంసన్ అద్భుత ప్రదర్శనను అభిమానులు గుర్తుంచుకోవాలని కోరారు. ఈ నిరాశను అధిగమించి శాంసన్ మరింత బలంగా తిరిగి వస్తాడనే నమ్మకం వ్యక్తం చేశారు. అలాగే వైభవ్ భారత జట్టుకు దీర్ఘకాలం సేవలందిస్తూ ఎన్నో రికార్డులు సృష్టించాలని ఆకాంక్షించారు.




# నోబాల్‌తో మ్యాచ్ గోవింద

## బిష్ణోయ్‌పై తీవ్ర విమర్శలు • మండిపడ్డ మాజీ క్రికెటర్

ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత జట్టు నాలుగు వికెట్ల తేడాతో ఓడిపోవడంపై మాజీ స్పిన్నర్ మనీందర్ సింగ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 16 ఓవర్ల వరకు మ్యాచ్ భారత్ చేతిలోనే ఉందని, కానీ 17వ ఓవర్‌లో రవి బిష్ణోయ్ 29 పరుగులు ఇవ్వడం మ్యాచ్‌ను మలుపుతిప్పిందని అన్నారు. ముఖ్యంగా నోబాల్స్ వేయడాన్ని టీ20 క్రికెట్‌లో "నేరం"గా అభివర్ణిస్తూ, బౌలింగ్ కోచ్‌లు దీనిపై మరింత శ్రద్ధ పెట్టాలని సూచించారు. మరోవైపు కొత్త టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై విశ్వాసం వ్యక్తం చేసిన ఆయన, సరైన సమయం దొరికితే జట్టును విజయాల బాట పట్టిస్తాడని చెప్పారు. ఇంగ్లండ్ పరిస్థితులకు భారత బ్యాటర్లు ఇంకా పూర్తిగా అలవాటు పడలేదని, ఐపీఎల్ తర్వాత వెంటనే పర్యటనకు రావడం ప్రభావం చూపిందన్నారు. ముందుగానే ఇంగ్లండ్‌కు వచ్చి ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడి ఉంటే ఆటగాళ్లు త్వరగా పరిస్థితులకు అలవాటు పడేవారని మనీందర్ అభిప్రాయపడ్డారు.







# టీమిండియాలో శివమ్ దూబేకు అవకాశం

## గాయపడిన నితీశ్ స్థానంలో ఎంపిక

శివమ్ దూబేకు భారత వన్డే జట్టులో మరోసారి అవకాశం లభించింది. గాయంతో బాధపడుతున్న నితీశ్ కుమార్ రెడ్డి ఇంకా పూర్తి ఫిట్‌నెస్ సాధించకపోవడంతో అతని స్థానంలో దూబేను ఎంపిక చేసినట్లు భారత జట్టు ప్రకటించింది. ఇప్పటికే గాయం కారణంగా ఐర్లాండ్, ఇంగ్లండ్ టీ20 సిరీస్‌లతో పాటు జింబాబ్వే పర్యటనకు కూడా నితీశ్ దూరమయ్యాడు. దూబే ఇప్పటివరకు నాలుగు వన్డేలు ఆడి 43 పరుగులు చేయడంతో పాటు ఒక వికెట్ కూడా తీశాడు. అతని చివరి వన్డే మ్యాచ్ 2024 ఆగస్టులో శ్రీలంకతో జరిగింది. ఇంగ్లండ్‌తో తొలి వన్డే అనంతరం మిగిలిన రెండు మ్యాచ్‌లు కార్డిఫ్, లార్డ్స్ వేదికల్లో జరుగనున్నాయి. ఆ సిరీస్ ముగిసిన వెంటనే దూబే జింబాబ్వే పర్యటనకు వెళ్లనున్నాడు. జూలై 23 నుంచి ప్రారంభమయ్యే టీ20 సిరీస్‌లో కూడా అతను భారత జట్టులో భాగం కానున్నాడు. దీంతో దూబేకు తన ప్రతిభను మరోసారి నిరూపించుకునే అవకాశం లభించింది.

# బీసీసీఐ ఎమర్జింగ్ టోర్నీకి సిక్కోలు క్రికెటర్

## త్రిపురాన విజయ్‌కు అరుదైన అవకాశం



శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన యువ క్రికెటర్ త్రిపురాన విజయ్కు బీసీసీఐ నిర్వహించే ఎమర్జింగ్ మెన్స్ క్రికెట్ టోర్నమెంట్-2026లో ఆంధ్ర జట్టు తరఫున ఆడే అవకాశం లభించింది. భారత మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ ఈ ఎంపికను ప్రకటించారు. జూలై 6 నుంచి 24 వరకు బెంగళూరులో జరిగే ఈ టోర్నీలో విజయ్ ప్రతిభ కనబర్చి భారత సీనియర్ జట్టుకు చేరాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# మంధాన, షెఫాలీ కాదు

◆ మహిళల టీ20 ప్రపంచకప్ జట్టు ప్రకటన
◆ ఐసీసీ జట్టులో ఏకైక భారత స్టార్ శ్రీచరణి

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నమెంట్ ఆఫ్ ది టోర్నమెంట్ జట్టులో చోటు దక్కించుకున్న ఏకైక భారత క్రికెటర్ శ్రీ చరణి కావడం విశేషం. స్టార్ బ్యాటర్లు స్మృతి మంధాన, షెఫాలీ వర్మలకు చోటు దక్కకపోయినా, అద్భుత బౌలింగ్‌తో శ్రీచరణి ఎంపికైంది. ఈ టోర్నీలో ఐదు మ్యాచ్‌లు ఆడిన ఆమె మొత్తం 14 వికెట్లు తీసి అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచింది. దీంతో మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఒకే ఎడిషన్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా కొత్త రికార్డు సృష్టించింది. ఇంతకుముందు ఈ రికార్డు పూనమ్ యాదవ్ పేరిట 10 వికెట్లతో ఉండేది. కీలక మ్యాచ్‌ల్లో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టిన శ్రీచరణి తన కచ్చితమైన బౌలింగ్‌తో భారత జట్టుకు ప్రధాన బలంగా నిలిచింది. ఆమె ప్రదర్శనకు గుర్తింపుగా ఐసీసీ అత్యుత్తమ జట్టులో చోటు దక్కడం భారత మహిళల క్రికెట్‌కు గర్వకారణంగా మారింది.



# డ్రాగన్ మూవీలో పవర్‌ఫుల్ రోల్‌లో ఎన్టీఆర్

## ఫ్యాన్స్ కోసం భారీ యాక్షన్ ఎపిసోడ్ ప్లాన్

యంగ్ టైగర్ ఎన్టీఆర్ , సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న హై `వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన'. ఈ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్ కోసం నందమూరి అభిమానులతో పాటు యావత్ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా, వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ ఎలివేషన్స్, ఎన్టీఆర్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ కలబోసి వస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా అప్‌డేట్స్ కోసం వేచి చూస్తున్న ఫ్యాన్స్‌కు దర్శకుడు ప్రశాంత్ నీల్ ఒక అదిరిపోయే యాక్షన్ ఎపిసోడ్‌ను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.ఈ సినిమాలో వచ్చే ఇంటర్వెల్ బ్లాక్ యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను థియేటర్లలో సీట్ల నుంచి లేచి నిలబడేలా చేస్తాయని సమాచారం. అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, వారిని పూర్తిగా దృష్టిలో పెట్టుకుని ప్రశాంత్ నీల్ ఈ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేశారట. ఈ ఇంటర్వెల్ లో తారక్ విధ్వంసక నటన, సరికొత్త యాక్షన్ స్టంట్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉండబోతున్నాయని టాక్. గతంలో ప్రశాంత్ నీల్ సినిమాల్లోని ఇంటర్వెల్ సీన్స్ ఎంతటి సంచలనం సృష్టించాయో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఎన్టీఆర్‌తో అంతకుమించిన భారీ యాక్షన్ విందును ఆయన సిద్ధం చేస్తున్నట్లు వినికిడి. ఇక ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ వీడియో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ గ్లింప్స్‌లో కథలోని అనేక కీలక పాత్రలను ప్రశాంత్ నీల్ పరిచయం చేసినప్పటికీ, అసలు కథకు మూలమైన మెయిన్ కాన్‌ఫ్లిక్ట్‌ను మాత్రం రివీల్ చేయకుండా చాలా సస్పెన్స్‌గా ఉంచారు. ఈ మెయిన్ కాన్‌ఫ్లిక్ట్ చుట్టూ తిరిగే కథాంశంలోనే హీరోయిన్ కృతి సనన్ క్యారెక్టర్ కూడా ఎంట్రీ ఇస్తుందని తెలుస్తోంది. కథను మలుపు తిప్పే అత్యంత కీలకమైన ట్రాక్‌లో ఆమె పాత్ర కనిపించబోతుండటంతో, సినిమాలో కృతి సనన్ పాత్ర ప్రాధాన్యతపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సాధారణంగా ప్రశాంత్ నీల్ సినిమా అనగానే అందరికీ ఫుల్ బ్లాక్ అండ్ గ్రే షేడ్ ఫ్రేమ్స్, డార్క్ థీమ్స్ మాత్రమే ఎక్కువగా గుర్తుకొస్తాయి. కానీ ఎన్టీఆర్ 'డ్రాగన్' విషయంలో ఆయన తన రూట్ మార్చినట్లు తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఈ క్రేజీ చిత్రాన్ని వచ్చే ఏడాది జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.



# 10న రాబోతున్న లెనిన్

## ఓటిటి హక్కులు దక్కించుకున్న జీ



చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకడు టాలీవుడ్ నటుడు అక్కినేని అఖిల్. ఈ సారి ఎలాగైనా హిట్టు కొట్టాలని మేకోవర్ మార్చుకుని లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన'గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు అఖిల్. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్ లో చిత్రయూనిట్ చెప్పిన మాటలు లెనిన్ గ్రాండ్ సక్సెస్ అవడం పక్కా అని ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నట్టు చెప్పకనే చెబుతున్నాయి. ఇదిలా ఉంటే సినిమా థియేటర్లలోకి రాకముందే అప్పుడే ఓటీటీ రిలీజ్‌కు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది. ఆయా ప్లాట్‌ఫాంలలో విడుదల తేదీలపై మేకర్స్ థియాట్రికల్ రిలీజ్ తర్వాత క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది.




# ఇరుముడితో బిజీ..

## అయినా కొత్త సినిమాపై దృష్టి

శ్రీవిష్ణుతో కలసి మల్టీస్టారర్ కోసం రవతేజ యత్నం మాస్ మహారాజా రవితేజ వరుస ప్రాజెక్టలతో దూసుకుపోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకులను అలరించిన ఆయన, ఇప్పుడు మరోసారి బిజీ షెడ్యూల్‌తో అభిమానులకు వరుస సినిమాలను అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం నటిస్తున్న ఆధ్యాత్మిక యాక్షన్ డ్రామా 'ఇరుముడి' చివరి దశ షూటింగ్‌లో ఉండగానే, మరో కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగు తోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాజా రాజా చోర' ఫేమ్ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో రవితేజ ఓ వినోదాత్మక చిత్రంలో నటించనున్నారని తెలుస్తోంది. ఈ సినిమాలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. హసిత్ గోలి శైలికి తగ్గట్టుగా హాస్యం, వినూత్న కథనం ప్రధాన బలాలుగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. ఈ నెలలో పూజా కార్యక్రమాలతో సినిమాను ప్రారంభించి, వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల మేళవింపుగా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా,

# మరోసారి టబూతో నాగార్జున

## నెగెటివ్ షేడ్‌లో ఉంటుందుంటూ ప్రచారం



టాలీవుడ్ కింగ్ నాగార్జున కెరీర్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న 100వ సినిమాపై అభిమానుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. ఇటీవల అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన' ప్రీ `రిలీజ్ ఈవెంట్ లో పాల్గొన్న నాగార్జున, తన మైలురాయి చిత్రం కింగ 100 కు సంబంధించిన అధికారిక అప్‌డేట్‌ను జూలై 10 తర్వాత వెల్లడిస్తానని ప్రకటించారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై సోషల్ మీడియాలో చర్చలు మరింత వేగం పుంజుకున్నాయి. ఇప్పటివరకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న తాజా వార్తలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ టబూ కీలక పాత్రలో కనిపించనున్నట్లు, అంతేకాదు ఆమె ఈసారి నెగెటివ్ షేడ్స్ ఉన్న ప్రధాన ప్రతినాయక పాత్రను పోషించే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. గతంలో నాగార్జున, టబూ కలిసి నటించిన సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వారి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీకి ప్రత్యేక అభిమానులు ఉన్నారు. అందుకే ఈసారి కూడా ఇద్దరూ జంటగా కనిపిస్తారని చాలామంది భావించారు. అయితే తాజా ప్రచారం ప్రకారం, టబూ ఈ చిత్రంలో హీరోయిన్‌గా కాకుండా నాగార్జునకు ఎదురుగా నిలిచే ప్రధాన ప్రతినాయకురాలి పాత్రలో నటించనున్నట్లు సమాచారం. ఈ వార్త నిజమైతే, ఇద్దరూ తొలిసారి పూర్తిగా భిన్నమైన పాత్రల్లో తలపడే అవకాశం ఉంటుంది. తండ్రి `కూతురు మధ్య సాగే భావోద్వేగ కథ ఈ సినిమాకు ప్రధాన బలంగా ఉండనుందని టాక్. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తుండగా, యువ నటి సుష్మిత భట్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072. Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085